వార్త
ఆదివారం
30 అక్టోబరు, 2022

# దా'రుణ' పాశాలు



# 'యశోద' నవంబరు 11న విడుదల

నాయిక ప్రధానంగా సమంత చేసిన సినిమాలు భారీ విజయం సాధించాయి. 'యూ టర్న్', 'ఓ బేబీ' సినిమాలు ఇందుకు నిదర్శనం. మరోసారి ఆమె చేసిన లేడీ ఓరియెంటెడ్ సినిమా 'యశోద'. సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ చిత్ర కథ నడుస్తుంది.
శ్రీదేవి మూవీస్ బ్యానర్‌పై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన సినిమా ఇది. హరిశంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం సమకూర్చారు. ఆయన అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకి హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు.
ఉన్ని ముకుందన్, మురళీశర్మ, సంపత్‌రాజ్, వరలక్ష్మి శరత్‌కుమార్ ముఖ్యమైన పాత్రలను పోషించారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



## తారాతీరం



# విజయ్ హీరోగా 'వారసుడు'

విజయ్ కథానాయకుడుగా వంశీ పైడిపల్లి 'వారసుడు' సినిమాను రూపొందిస్తున్నాడు. దిల్ రాజు నిర్మాణంలో ఈ సినిమా నిర్మితమవుతోంది. తెలుగుతో పాటు తమిళంలో ఒకేసారి ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. తమిళంలో 'వరిసు' అనే టైటిల్ ఖరారు చేశారు.
విజయ్ జోడీగా మొదటిసారి రష్మిక అలరించనుంది.
విభిన్నమైన కథా కథనాలతో ఈ సినిమా రూపొందుతున్నట్లు తెలుస్తోంది. తమన్ స్వరపరిచిన పాటలు ఈ సినిమాకి హైలైట్‌గా నిలుస్తాయని అంటున్నారు.
'బీస్ట్' చిత్రం తర్వాత విజయ్ నుంచి వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
30 అక్టోబరు, 2022

## మంచి ముత్యాలు

మనల్ని మెచ్చుకునే వారిని ప్రేమిస్తాం కాని,
ప్రేమించేవారిని మెచ్చుకోము.

\- రోషి

## విషయ విశేషం


నాచు గులాబీలు... 4

'సంఘీ'భావం....5

మహిళలకు అభయం ఇవ్వలేకపోతున్న చట్టాలు

ప్రకృతి దృశ్య కావ్యం మలేసియా..6

కవర్ స్టోరీ..8

దా 'రుణ' పాశాలు

అజరామరం 'రక్తసంబంధం'..14

ఆహార వృధాను అరికట్టాలి!..18

కథ.. 20

త్రినేత్రా

సాహిత్యం.. 23

ప్రజాకవి కాళోజీ

పుస్తకపఠన..ప్రాధాన్యం..26

ఈవారం కవిత్వం..29

ఆమే గొప్ప..!

చిత్రభారతి.. .30

భారతీయ సినిమా పితామహుడు..సత్యజిత్‌రే... 30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..





## తాజా వార్తలు

### ఉపవాసం వల్ల అల్జీమర్స్ రాదా..?

అప్పుడప్పుడు ఉపవాసం చేయడం ఆరోగ్యానికి మంచిదన్న విషయం విదితమే. కానీ కొంతమంది ఆకలికి ఆగలేరు. కనుకనే అలాంటి వారు పూజలు, వ్రతాల సమయంలో నీటి శాతం ఎక్కువగా ఉండే జావలు, పండ్లని తీసుకోమని పెద్దలు చెప్తుంటారు. తద్వా రా ఉపవాసం చేసినట్లువుతుంది, ఆకలీ తీరుతుంది. ఈ రకమైన ఉపవాసాలు నిజంగానే ఆరోగ్యానికి మేలు చేస్తాయని సశాస్త్రీయంగా పేర్కొంటున్నారు సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీ నిపుణులు. నెలకి రెండు విడతలుగా వారం నుంచి పది రోజుల పాటు ఉపవా సం చేస్తే వృద్ధాప్యంలో అల్జీమర్స్ వచ్చే ప్రమాదం తగ్గుతుందట. మితాహారంతో కూడిన ఉపవాసం వల్ల మెదడు కణాల్లో ఇన్‌ఫ్లమే షన్ శాతం తగ్గినట్లు ఎలుకలపై చేసిన పరిశీలనలో తెలిసింది. అంతేకాదు.. దీనివల్ల మూలకణాల ఉత్పత్త పెరిగిందనీ తద్వారా కేన్సర్, మధుమేహం, హృద్రోగాలు, వయసుతో పాటు వచ్చే ఇతరత్రా సమస్యలు తగ్గుముఖం పట్టినట్లు నిపుణులు గుర్తించారు. ఒకటీ రెండు నెలలు కాకుండా ఒక సంవత్సరం పాటు ఇలా చేయ డం వల్ల ఎలుకల్లో ఆక్సీకరణ ఒత్తిడి కారణంగా మెదడు కణాలు దెబ్బతినడం చాలావరకు తగ్గినట్లు కనుగొన్నారు.

**పల్లె మెచ్చిన ప్రజా ప్రతినిధి 'ఆశా'**

కొన్ని ప్రాంతాల్లో మహిళల చేతిలో అధికారం వున్నా పెత్తనం వారి భర్తలే చెలాయిస్తుంటారు. మధ్యప్రదేశ్‌లోని ఝిరి గ్రామ సర్పంచి ఆశాబాయి కైత్వాస్ గెలిచినప్పుడు కూడా చాలామంది అలాగే అనుకున్నారు. మహిళల్ని చిన్నచూపు చూసే ప్రాంతంలో సర్పంచిగా గెలిచిన ఆశా అధికారాన్ని భర్త చేతిలో పెట్టకుండా పల్లె ప్రగతే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఝిరి హైవే పక్క గ్రామం అయినందువల్ల దొంగతనాలు ఎక్కువగా జరిగేవి. ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండేది కాదు. ఆ సమస్య మీద దృష్టి పెట్టిన ఆశా ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న మరికొన్ని హైవే గ్రామాల్లో సీసీ కెమెరాలు అమర్చుకున్న తరువాత దాన్నుంచి బయట పడటం గమనించింది. ఝిరిలో కూడా అలా సీసీ కెమెరాలు పెట్టాలంటే లక్షల్లో ఖర్చవుతుంది. అధికారులు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత అని చెప్పి సమస్య గురించి సీరియస్‌గా పట్టించుకోలేదు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ఆశా తన బంగారాన్ని తాకట్టు పెట్టి, సీసీ కెమెరాలు, టీవీల కొనుగోలు చేసి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది.




# నాచు గులాబీలు



చెట్టునిండుగా ఆకులే కనిపించకుండా గులాబీలు పూస్తే చూడ్డానికి రెండు కళ్లూ చాలవు. అంత అందంగా ఉంటాయి. కానీ అలా పూయించాలంటే ఎంతో సమయం కేటాయించాలి. మరెంతో శ్రద్ధగానూ పెంచాలి. అదే నాచు గులాబీలయితే ఏమాత్రం కష్టపడకుండానే విరబూస్తాయి. ఎక్కడంటే అక్కడ ఎలా అంటే అలా..నచ్చిన ఆకారంలోనూ పెంచుకో. పైగా గులాబీలయితే ఒకే  కుండీలో రెండుమూడు రంగుల కన్నా పెంచలేం. కానీ నాచుగులాబీల్లో ఎన్ని రంగులైనా పెంచుకోవచ్చు.
నాచుమొక్కల్లా నేల బారుగా పెరుగుతూ చిట్టి గులాబీల్లా ముద్దుగా ఉంటాయనే కాబోలు, వీటికి నాచు గులాబీ అని పేరు పెట్టేశారు, కానీ లెవనో క్లాక్, మెక్సికన్ రోజ్, సన్ రోజ్, రాక్ రోజ్..ఇలా వీటికి చాలానే పేర్లు ఉన్నాయి.








## 'సంఘీ' భావం



# మహిళకు అభయం ఇవ్వలేకపోతున్న చట్టాలు

సమాజంలో మహిళకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ అనేక అవకాశాలు, చట్టాలు తీసుకువచ్చినా ఆశించిన మార్పు కనిపించడం లేదు. లైంగిక వేధింపులు, అత్యాచారాలు, గృహహింస, పనివేతనాల్లో వ్యత్యాసం వంటి అనేక సమస్యలు ఇంకా వెంటాడుతూ ఉన్నాయి. ఢిల్లీలో నిర్భయ ఘటన తరువాత అలాంటివి మళ్లీ జరగకుండా ఉండేందుకు చట్టాల్లో అనేక మార్పులు తీసుకువచ్చారు. అయితే అంతకు మించిన ఘాతుకాలు జరుగుతూనే ఉన్నాయి. మహిళలపై అత్యాచారాలు చేయడమే కాకుండా అమానవీతతో నిందితులు కర్కషంగా వ్యవహారిస్తున్న తీరు ఆందోళనకు గురిచేస్తోంది. నెలలు నిండని చిన్నారి నుంచి ప్రౌఢవయస్సు మహిళలపై అత్యాచార ఘటనలు నమోదు అవుతూనే ఉన్నాయి. పోలీసు రికార్డులకు ఎక్కిన కేసుల కంటే జరుగుతున్న నేరాలు వెలుగు చూస్తున్నవి చాలా తక్కువగా ఉంటున్నాయని అధ్యయనాలు తెలుస్తున్నాయి. కుటుంబ పరువు పోతుందని కొందరు, తమ బాధ బయటకు చెప్పుకోలేక మరికొందరు, బెదిరింపులు, ధనబలం, అధికారం బలంతో పాటు కట్టుబాట్లకు కట్టుబడి ఇంకొందరు మహిళలు తమలో తామే కుమిలిపోతున్నారు. ఇలాంటి ఘటనలు నిందితులకు మరిన్ని నేరాలు చేసే అవకాశం కల్పించినట్లు అయి చెలరేగిపోతున్నారు. మహిళలపై అత్యాచారాలే కాదు అసభ్యంగా ప్రవర్తించిన వారిని కూడా వదలిపెట్టకుండా శిక్షలు అమలుచేసినప్పుడే కొంతవరకైనా ప్రయోజనం ఉంటుంది. అత్యాచారాలు, లైంగిక వేధింపులు పాతకాలం నాటి నుంచి ఉన్నప్పటికీ ప్రస్తుతం మారుతున్న సమాజపోకడలతో అవికాస్త మితిమీరిపోతున్నాయి. నీలిచిత్రాలు అరచేతిలో అందేంత సులభం కావడంతో సహజంగానే కొందరు ఉద్రేకాన్ని తట్టుకోలేక నేరాలకు పాల్పడి మహిళలకు అన్యాయం చేయడంతో పాటు వారు కూడా జైలు పాలై జీవితాన్ని కోల్పోతున్నారు. మన దేశంలో మహిళలపై జరుగుతున్న నేరాలను పరిశీలిస్తే ఆందోళన కలుగుతోంది. మహిళలు నిర్భయంగా నడిరోడ్డుపై నడిచే అవకాశం లేకుండాపోతోందని భయం కలుగుతోంది. గత సంవత్సరంలో మన దేశంలో 31,677 అత్యాచార కేసులు నమోదు అయ్యాయి. ఈ లెక్కన రోజుకు ఏదో ఒక ప్రాంతంలో 86 మంది మహిళలు అత్యాచారానికి గురౌతున్నారు. ఇవి కేవలం పోలీసు రికార్డులకు ఎక్కిన కేసులు మాత్రమే. జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సిఆర్‌బి) పేర్కొన్న వివరాలను పరిశీలిస్తే మహిళలపై ఇన్ని రకాల నేరాలు జరుగుతున్నాయా అని ఆశ్చర్యం కలుగుతుంది. అత్యాచారం జరిపి హత్య చేయడం, వరకట్న వేధింపులు, యాసిడ్ దాడులు, ఆత్మహత్యలకు ప్రేరేపించడం, గృహహింస, కిడ్నాప్‌లు, మహిళల అక్రమ రవాణా, పనిచేసే సంస్థల్లో లైంగిక వేధింపులు, అవకాశాలు, ప్రమోషన్లు ఇస్తామని ప్రలోభపెట్టి మహిళలను లొంగదీసుకోవడం వంటి అనేక నేరాలు మహిళలపై జరుగుతున్నాయి. మహిళలకు రక్షణ కల్పించేందుకు అనేక చట్టాలు రూపొందించారు. గతంలో ఉన్న చట్టాల్లో పెనుమార్పులు చేశారు. అయినా నేరాల సంఖ్య ఏమాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. 2021లో మహిళలపై అన్ని రకాల నేరాలను పరిశీలిస్తే మొత్తం 4 లక్షల 28 వేల 278 కేసులు నమోదు అయ్యాయి. ప్రస్తుతం కొత్తగా ఆన్‌లైన్ వేధింపులు ఎక్కువ అయ్యాయి. ఫోన్‌లు, సోషల్ మీడియాలో మహిళలను వేధించడం, మార్ఫింగ్ చేసి నగ్న చిత్రాలకు ఆమె ఫోటోను అతికించి బ్లాక్‌మెయిల్ చేయడం, సోషల్ మీడియాలో పెడతానని బెదిరించడం వంటివి అధికం అయ్యాయి. 2020లో మహిళలపై 3 లక్షల 71 వేల 503 కేసులు నమోదు కాగా, 2019లో నాలుగు లక్షలకుపైగా కేసులు నమోదు అయ్యాయి. మహిళలపై జరుగుతున్న నేరాల్లో ఉత్తరప్రదేశ్ 56 వేల కేసులతో మొదటి స్థానంలో ఉండగా వరుసగా రాజస్థాన్ 40 వేలు, మహారాష్ట్ర 39 వేలు, పశ్చిమబెంగాల్ 35 వేలు, ఒడిశా 31 వేల కేసులతో తరువాత స్థానాల్లో ఉన్నాయి. ఇవన్నీ పోలీసు రికార్డులకు ఎక్కిన కేసులు. పోలీసుల దృష్టికి వచ్చినా కేసులు నమోదు చేయని ఘటనలు.తమపై అత్యాచారాలు గాని, లైంగిక వేధింపులు కాని జరిగినప్పుడు ఫిర్యాదు చేస్తే నిందితులకు శిక్ష తప్పనిసరిగా పడుతుందన్న నమ్మకం కలిగినప్పుడు మహిళలు పోలీసులను ఆశ్రయిస్తారు. అయితే అలాంటి పరిస్థితులు లేవు. అత్యాచారానికి గురైన మహిళ పోలీసు స్టేషన్‌కు వెళితే అత్యాచారం జరిగిన సమయంలో కలిగిన బాధ కంటే పోలీసులు ప్రవర్తించే తీరుకు కలిగే మానసిక వేదన అంతకు పది రెట్లు ఉంటుందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమపై జరిగిన నేరానికి ఆధారాలు, సాక్ష్యాలు, రుజువులు చూపించాల్సి ఉంటుంది. లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరిగినప్పుడు సాక్ష్యంగా ఎవరు ఉంటారన్నది ప్రధాన ప్రశ్న. ఒకవేళ పోలీసులు కేసు నమోదు చేసి న్యాయస్థానానికి పంపిస్తే కొన్ని నెలలు, సంవత్సరాల పాటు కేసు సుదీర్ఘంగా జరుగుతుంది.సాక్ష్యాలు, రుజువులు లేక న్యాయస్థానం నిందితులను నిర్దోషులుగా వదిలిపెట్టినా సమాజం మాత్రం అత్యాచారం జరిగిన ఘటనను పూర్తిగా విశ్వసించి సదరు మహిళపై చులకన భావాన్ని ప్రదర్శిస్తుంది.

అత్యాచారం జరిగిన దానికంటే సమాజంలో ఆమె ఎదుర్కొనే సమస్య మరింత మానసిక క్షోభను కలిగిస్తుంది. న్యాయస్థానాల్లో న్యాయం జరిగినా లేకపోయినా నిందితులను సమాజం వెలివేయాలి. ముందు అతని ఇంటి నుంచి ఈ విధానాన్ని అమలు చేయాలి. మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి అత్యాచారానికి గాని, లైంగిక వేధింపులకుగాని గురైన మహిళకు అండగా నిలబడాలి. మహిళా నేరాలకు సంబంధించిన చట్టాల్లో మార్పులతో పాటు ప్రభుత్వపరంగా ప్రత్యేక సహాయాన్ని, చేయూతను ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు రావాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# ప్రకృతి దృశ్య కావ్యం మలేసియా



ఆసియా ఖండంలోని ముఖ్య దేశాల్లో మలేషియా ఒకటి. అందాల ప్రకృతి దృశ్య కావ్యంగా భాసిల్లుతున్న మలేషియా రెండు ప్రధాన భూభాగాలుగా విభజించబడి ఉంది. ఒకటి: పశ్చిమ మలేషియా. ఇది థాయిలాండ్ భూభాగంలో కొంతమేరకు కలిసి ఉంది. రెండోది: దక్షిణ భూభాగంలో ఉంది. ఇది బోర్నియో ద్వీపంలో మిళితమై ఉంది. మలేషియాలో పర్యాటక ప్రదేశాలతో పాటు జీవ వైవిధ్యం, భిన్న సంస్కృతులు, విభిన్న ఆచారాలు, సంప్రదాయాలు, చారిత్రక కట్టడాలు, నోరూరించే వంటకాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రత్యేకతలు ఇక్కడ కనిపిస్తాయి.

**షేక్ అబ్దుల్ వాహీం జాని**

## పెట్రోనాస్ ట్విన్ టవర్స్

మలేషియా పేరు చెప్పగానే ఆ దేశ రాజధాని కౌలాలంపూర్‌లోని పెట్రోనాస్ ట్విన్ టవర్స్ అందరికీ గుర్తుకు వస్తాయి. ఆకాశాన్నంటే జంట సౌధాల కలయికనే పెట్రోనాస్ ట్విన్ టవర్స్ అని పిలుస్తారు. 88 అంతస్తుల ఈ జంట భవనం మలేషియాకే ప్రత్యేక ఆకర్షణ. ప్రపంచంలోనే ఎత్తయిన భవనాలలో ఇవి ఒకటి. దీని నిర్మాణం 1998లో జరిగింది. పెట్రోనాస్ టవర్స్ ఎత్తు 1483 అడుగులు. అంటే సుమారు 452 మీటర్లు. కాంక్రీట్, ఉక్కు, అల్యూమినియం, స్టెయిన్‌లెస్ స్టీల్ మొదలైన వాటితో గంభీరంగా నిర్మితమైన పెట్రోనాస్ టవర్స్ నిర్మాణానికి 8 వేల కోట్ల రూపాయలు పైబడి ఖర్చు అయింది. ఇస్లామిక్ శిల్పశైలిలో కనబడే ఈ జంట భవనాలను కలుపుతూ 41,42 అంతస్తుల వద్ద ఒక ఆకాశ వారధి కూడా నిర్మించారు. ఈ వంతెన 750 టన్నుల బరువు, 58.4 మీటర్ల పొడవులో గ్రౌండ్ ఫ్లోర్ నుండి 170 మీటర్ల ఎత్తులో నిర్మించారు. ప్రజలు ఇందులోని ప్రవేశించిన తరువాత అత్యాధునికమైన, అతి వేగంగా పై అంతస్తుకు చేరుకోవడానికి డబుల్ డెక్కర్ లిఫ్టులు ఇరవై తొమ్మిది, పది ఎస్కలేటర్లు ఏర్పాటు చేశారు. అడుగు భాగం నుండి పైనున్న 88వ అంతస్తుకు వీటి ద్వారా చేరుకోవడానికి తొంభై సెకన్ల సమయం పడుతుంది. జంట టవర్స్‌కు ముప్పై రెండు వేల కిటికీలు ఉన్నాయి. ఈ భవనం నిర్మించడానికి 36,910 టన్నుల ఉక్కును వాడారు. 1999 ఆగస్టు 28న మలేషియా ప్రభుత్వం పెట్రోనాస్ ట్విన్ టవర్స్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఆసియా ఖండంలోనే ఎత్తయిన జంట భవనాలుగా పెట్రోనాస్ విరాజిల్లుతోంది. ఈ భవనంలో దాదాపు పది వేల మంది పని చేస్తుంటారు. ఇందులో కార్ పార్కింగ్ ఉంది. షాపింగ్ కాంప్లెక్స్, పెట్రోలియం సంస్థ అయిన పెట్రోనాస్ కార్యాలయం, మ్యూజియం, మసీదు, వినోద సౌకర్యాలు, సింఫనీ హాల్, మల్టీ మీడియా కాన్ఫరెన్స్ సెంటర్ మొదలైనవి ఈ జంట భవనాలలో ఉన్నాయి.



ఈ భవన మసుదాయంలోని కొన్ని గదులను బహుళజాతి సంస్థలకు అద్దెకు ఇచ్చారు. మలేషియాకు సంబంధించిన ఆర్థిక విజయానికి నిదర్శనంగా పెట్రోనాస్ ట్విన్ టవర్స్ నిలుస్తాయి. కౌలాలంపూర్‌లో భారీ షాపింగ్ మాల్స్‌కు కొదవ లేదు. చైనా టౌన్‌ను ఆనుకుని వుండే పురాతన సెంట్రల్ మాల్ చాలా ప్రత్యేకతలు కలిగి ఉంది. అందులోని ఒక బ్లాకు మొత్తం ఆర్టిస్టులు, వారి పెయింటింగ్స్‌తో నిండి ఉంటుంది. కమల్‌హాసన్, రజనీకాంత్, శివాజీ గణేశన్ వంటి సౌత్ స్టార్ల పెయింటింగ్స్ ఇక్కడ కనిపిస్తాయి.

రాయల్ సెలంగూర్ అనేది ఉన్నత స్థాయి కళాకృతులకు నిలయం. ఇక్కడి వస్తువులన్నీ 'ప్యూటర్'లో తయారైనవే. ప్యూటర్ అంటే దాదాపు తగరమే. కానీ 1 నుండి 15 శాతం వరకు రాగి, ఆంటిమొనీ, సీసం, వెండి వంటి ఇతర లోహాలూ కలుస్తాయి. అందుకే ధర రూ.3 వేల నుండి రూ.3 కోట్ల వరకు ఉంటుంది. కౌలాలంపూర్ బర్డ్ పార్క్ చాలా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ స్వేచ్ఛగా సంచరిస్తోన్న పక్షుల మధ్య మనుషులు కూడా తిరిగి అవకాశం కల్పిస్తారు. ప్రపంచంలోని ఈ తరహా పార్కుల్లో ఇదే అతి పెద్దది. పెద్ద పెద్ద నెమళ్లతో సహా 200 రకాల దేశ, విదేశీ పక్షులున్న ఈ పార్కులో జలపాతం, యాంఫీ థియేటర్, బర్డ్ స్కూల్, ఫ్లెమింగో పాండ్, కియోస్క్.. ఇలా రకరకాల ఆకర్షణలున్నాయి.

కౌలాలంపూర్ నుండి 40 కి.మీ. దూరంలో నిర్మించిన మలేషియా పాలనా రాజధాని 'పుత్రజయ' ప్రాంతాన్ని కూడా పర్యాటకులు ఆసక్తిగా సందర్శిస్తారు. నీటిపై తేలుతున్న ట్లుగా కనిపించే అతి పెద్ద మసీదు, రోడ్డు చివర నుంచి చూసినా ఠీవిగా కనిపించే ప్రధాని కార్యాలయం, 70 ఎకరాల బొటానికల్ గార్డెన్, 76 మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాల కార్యాలయాలు, 39 ఇతర ప్రభుత్వ భవనాలు, మూడు వేల మంది సమావేశమయ్యే కన్వెన్షన్ సెంటర్ ఇత్యాదివి పుత్రజయ ప్రాంత విశేషాలు.

**కెమెరాన్ హైలాండ్స్**

ఇది మలేషియాలో అత్యంత పురాతన పర్యాటక కేంద్రాలలో ఒకటి. ఇది కొండకోనల్లో నెలకొని ఉంది. చల్లని వాతావరణం, కనుచూపు మేరలో ఎత్తయిన టిటివాంగ్స్ పర్వతాలు, తివాచీలా పరచుకున్న ఆకుపచ్చ తేయాకు తోటలు, రంగు రంగుల పూల తోటలు, గోల్ఫ్ క్రీడా కోర్టులు, దట్టమైన అడవులు, లోయలు, జలపాతాలు, ఇక్కడ నివసించే గిరిజనులు నగర జీవిత హడావుడి నుంచి ప్రశాంతమైన వాతావరణంలోకి మనతో పాటు మన మనసుని కూడా తీసుకుని వెళతారు. ఇలా నయనానందం కలిగించే ప్రకృత రమణీయత మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుంది.



ఫ్రాసర్ హిల్స్ మలేషియా రాజధాని కౌలాలం పూర్ నుండి రెండు గంటల పాటు ప్రయాణం చేస్తే ఫ్రాసర్ హిల్స్ చేరుకోవచ్చు. ఇక్కడి పహాగ్ పర్వతాల వద్ద అద్భుతమైన సైనిక రిసార్ట్ ఉంది. దీన్నే మలేషియాలో 'బుకిట్ ఫ్రేజర్' అని పిలుస్తారు. ఈ హిల్ స్టేషన్ మలేషియా వారికే కాదు అంతర్జాతీయ ప్రయాణికులకు ఒక గొప్ప ప్రదేశం. ఈ ఫ్రాసర్ హిల్స్ 1800 సంవత్సరాల నాటివని అక్కడివారు చెబుతుంటారు. ఈ ప్రదేశం ఖనిజ వ్యాపారాలకు అత్యంత ప్రసిద్ధి.

**బటు గుహలు**

కౌలాలంపూర్‌లోని సెలంగోర్‌లో నెలకొని వున్న బటు కేవ్స్ ప్రత్యేకమైనవిగా చెప్పవచ్చు. ప్రపంచంలోనే అతి పెద్ద కార్తికేయుడి(సుబ్రహ్మణ్యేశ్వర స్వామి) విగ్రహం ఉందిక్కడ. ఈ గుహల వద్ద వున్న ఆలయం సమీపంలో మురుగన్ విగ్రహం ఉంది. దీని ఎత్తు నూటా నలభై అడుగులు. అంటే దాదాపు పధ్నాలుగు అంతస్తుల భవనమంత ఎత్తులో ఉంటుంది. బంగారు వర్ణంలో మెరిసే భారీ మురుగన్ విగ్రహం పర్యాటకులకు స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తుంది. ఈ ప్రధాన గుహ వద్ద మురుగన్ ఆలయంతో పాటు ఇతర ఆలయాలు ఉన్నాయి. తమిళ భక్తులు ఎక్కువగా ఈ ప్రాంతానికి వస్తుంటారు. ఇక్కడ ఉన్న ప్రతి గుహ ఒక ప్రత్యేకతను కలిగి వుంది. బటు గుహను చూడటానికి కాలినడకన వెళుతుంటారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే ఇక్కడ దుస్తులు, ఆహారం, నివాస వసతుల కోసం అయ్యే ఖర్చు తక్కువే.



**పెనాంగ్ బీచ్**

పెనాంగ్ అనేది మలేషియాలోని ఒక రాష్ట్రం. ఇది మలక్కా కాలువ నీటితో చుట్టబడిన భూభాగంతో మలేషియా తూర్పు పశ్చిమ తీరంలో నెలకొని ఉంది. మింగ్ సామ్రాజ్యానికి చెందిన అడ్మిరల్ జంగ్ హే 15వ శతాబ్దంలో ఉపయోగించిన నావికా చిత్రాలు ఈ ద్వీపంలో భద్రపరిచారు. పినాంగ్ అంటే వక్కచెట్ల తోట అని అర్థం. ఈ ద్వీపానికి చుట్టూ అనేక వక్కచెట్లు ఉండటం వల్ల ఆ పేరు వచ్చినట్లు చరిత్రకారులు చెబుతారు. పెనాంగ్‌లోని కెక్ లాక్ సి టెంపుల్‌ని తిలకించేందుకు అనునిత్యం దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు.

పెరక్ రాష్ట్రంలో ఉన్న పాంకోర్ దీవి అందాలు తప్పనిసరిగా సందర్శించదగినవి. నెగెరీ సెంబిలన్, మెలాకా రాష్ట్రాలు ప్రాచీన కట్టడాలకు ప్రసిద్ధి. జోహార్ అందమైన బీచ్‌లకి ప్రతీక. మలేషియా ద్వీపకలంపతో పాటు సభా-సరావా రాష్ట్రాల్ని దక్షిణ చైనా సముద్రం విడదీస్తుంది. అక్కడికి వెళ్లాలంటే విమానంలో గంటపాటు ప్రయాణం చేయాలి. ప్రకృతి రమణీయత, ఆదివాసీల జీవనశైలి, ప్రశాంత వాతావరణం, నాగరిక త అంటని అమాయకత్వం ఈ రాష్ట్రాల ప్రత్యేకత. ఇక్కడ మలై ప్రజానీకంతో పాటు 120 తెగల ఆదివాసి ప్రజలు ఉంటారు.

**నోరూరించే వంటకాలు**

మలేషియా వంటకాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. బెలకస్, చిల్లా పెప్పర్స్, రెంపహ్ మొదలైన రుచులు పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తాయి. నాసి లెమక్, కాంగి, రోటి కన్నై ఇత్యాది వంకటాలు మరోసారి తినాలనిపించేలా ఉంటాయి. స్ట్రీట్ ఫుడ్ చౌకగా లభిస్తుంది. హనీమూన్ జంటలు, ఫిల్మ్ టూరిజానికి మలేషియా ప్రసిద్ధి. ఇక్కడి మ్యూజియంలు, ఉద్యానవనాలు, పశు పక్ష్యాదులతో పాటు అడ్వెంచర్

**(మిగతా 27వ పేజీలో)**




# దా 'రుణ' పాశాలు

**ఆధునిక యుగంలో నేటి మనీ ఎకానమీలో కోట్లాది ఈ దేశ ప్రజల జీవన మనుగడ, భవిష్యత్తు ఆర్థిక వనరుల పునాదుల పైనే ఆధారపడి ఉంటుందనే సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. 'ధనం మూలం ఇదం జగత్' అనే లోకోక్తి ప్రకారం డబ్బు లేనిదే ఏదీ జరగదనే సత్యం లోక విదితమే.**

కవర్ స్టోరీ

**నీలం సంపత్**

ఈ నేపథ్యంలో కనీస జీవితావసరాలను తీర్చుకుంటూ ఈ దేశ ప్రజలు తమ ఉనికినీ, మనుగడనూ సుస్థిరం చేసుకోవాలంటే అందుకవసరమైన ఆర్థిక వనరులను సంపాదించుకునే ఉద్యోగ, ఉపాధి కల్పనల వెసులుబాటును ప్రభుత్వం త్రికరణ శుద్ధిగా కల్పించాల్సిందే. అది జరిగినప్పుడే ఈ దేశ ప్రజలు తమలో జనించే కోరికలను తృప్తి పరచుకోవడానికి అవసరమైన వస్తుసేవలను పొందడానికవసరమైన ఆర్థిక కార్యకలాపాలలో పాలుపంచుకోవడం ద్వారా స్వావలంబనతో సజావుగా జీవనాన్ని కొనసాగించడం జరుగుతుంది. లేని పక్షంలో అప్పులు చేసైనా సరే తమ జీవనాన్ని కొనసాగించక తప్పదు. సంఘటిత రంగం అప్పులను సమకూర్చని వేళ మెజారిటీ ప్రజలు అనివార్యంగా దేశీయ బ్యాంకర్లు, వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాలలో చిక్కుకుని విలవిల్లాడడం నిన్నటి చరిత్ర కాగా నేడు అది ఆన్‌లైన్ మొబైల్ యాప్‌ల మోసాలకు నెలవుగా మారి అవసరార్థులైన మధ్య తరగతి, అట్టడుగు వర్గాల ప్రజల ప్రాణాలు తీస్తున్న వైనం ప్రస్తుతం నడుస్తున్న చరిత్రకు నిలువెత్తు నిదర్శనంగా భావించాల్సిందే.

### ఆర్థిక అసమానతల పెంపుదలే అప్పుల ఊబిని సృష్టిస్తోంది..

స్వతంత్ర భారతంలో సంపద సృష్టికి కొదవలేదు. కాకపోతే వృద్ధి చెందుతున్న ఆ సంపద యావత్తూ ఈ దేశంలోని పిడికెడు మంది కోటీశ్వరుల చేతుల్లో బందీగా మారుతున్న నేపథ్యంలో ఈ దేశ కోటీశ్వరులు ప్రపంచ కుబేరుల జాబితాలో పతాక స్థానాన్ని ఆక్రమించుకుంటున్న వేళ ఒక్కో కోటీశ్వరుడు ఆ శిఖరాగ్రానికి చేరుకోవడానికి లక్షలాది ఈ దేశ సామాన్య ప్రజలను దారిద్ర్యపు ఉక్కు కౌగిలిలోకి నెట్టివేస్తుండడం అమానవీయమే. ఫలితంగా మెజారిటీ ప్రజలు పిడికెడు మెతుకుల కోసం అవసరమైన ఆర్థిక వనరులు అందుబాటులో లేక ఆకలి చావుల బారిన పడుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. నిన్నటికి నిన్న ప్రకటించిన ప్రపంచ ఆకలి సూచీలో మన దేశం 107వ స్థానానికి దిగజారడం (121 దేశాల జాబితాలో) అత్యంత దురదృష్టకరంగా అభివర్ణించక తప్పదు. పేదరిక విష వలయంలో చిక్కుకొని విలవిల్లాడుతున్న కోట్లాది ప్రజలు తమ ఆర్థిక అవసరాలను తీర్చుకోవడం కోసం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఇన్‌స్టంట్ మనీ లోన్ యాప్‌ల ఆకర్షణలో పడుతున్న నేపథ్యంలో సదరు లోన్ యాప్‌లు సురక్షితమైనవి ఔనా? కాదా? అని పరిశీలించకుండానే ఆ సైబర్ నేరగాళ్ల వలలో పడుతుండడం శోచనీయం.

### కరోనా కల్లోలంతో అడుగంటిన ఆదాయ మార్గాలు?

ఆర్థిక వనరుల పంపిణీలో అసమానతలు అంతకంతకూ పెరుగుతున్న వేళ ప్రపంచ ఆర్థిక వ్యవస్థయే కుదేలైన మన దేశంలో సైతం కోట్లాది ఈ దేశ ప్రజలను కరోనా మహమ్మారి మృత్యుకోరల నుండి కాపాడు కునే క్రమంలో దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్, సోషల్ డిస్టెన్స్ అనివార్యమైన ఫలితంగా ఉత్పత్తి రంగంతో పాటు రోడ్లు, రహదా రులు, భవన నిర్మాణ రంగాలు సైతం మూత పడిన కారణంగా కోట్ల సంఖ్యలో ఉద్యోగులూ, కార్మికులూ ఉన్న ఉద్యోగాలు ఊడి కనీసం తినడానికి ఓ పూట తిండికి కావల్సిన ఆదాయాన్ని కూడా సంపాదించుకోలేకపోవడం అత్యంత దురదృష్టకరంగా అభివర్ణించక తప్పదు. కరోనా మహమ్మారి సృష్టించిన ఆర్థిక విలయం నుండి మధ్య,

నిరుపేద వర్గాల ప్రజలకు అవసరమైన ఆర్థిక స్వాంతనను కలిగించడానికి వారి ఆకలి తీర్చడానికి అవసరమైన ఆహార పదార్థాలను సైతం సమకూర్చడానికి ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడం గమనార్హం. ఫలితంగా ప్రజలు తమ ఆకలిని తీర్చుకోవడానికి అవసరమైన ఆదాయాలు సమకూరనప్పుడు అప్పు చేసైనా సరే తమ ఆకలి తీర్చుకోక తప్పనిసరి పరిస్థితులు ఎదుర్కోవడం.

మరోవైపు ఉద్యోగాలు లేక, ఉన్న ఉద్యోగాలు ఊడి కరోనా రక్కసి తమ ప్రాణాలను సైతం కబళిస్తుందేమోనని భయంతో, సదరు మహమ్మారిచే ప్రాణాపాయ ఒత్తిళ్ల నుండి బయట పడడానికి మద్యంతో పాటు ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడడం విభ్రాంతిని కలిగిస్తోంది. ఈ క్రమంలో వారి మనుగడకు అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి వెంపర్లాడుతున్న నేపథ్యంలో చైనా లాంటి దేశాలకు చెందిన ఆన్‌లైన్ సైబర్ నేరస్తులతో పాటు స్వదేశీ సైబర్ నేరగాళ్లు సైతం ఆన్‌లైన్ ద్వారా అతి తక్కువ సమయంలో, అతి సులభమైన నిబంధనలతో సెకన్లు, నిమిషాల కాల వ్యవధితో మైక్రో క్రెడిట్‌ని సమకూర్చడానికి తమ సంసిద్ధతను తెలియజేయడం. అదే సమయంలో తమ పిల్లల చదువుల కోసం, కుటుంబాల అవసరాలను తీర్చుకోవడానికి అవసరమైన ఆర్థిక వనరుల కోసం ఎంత ప్రయత్నించినా అప్పు దొరక అల్లాడుతున్న మధ్య తరగతి, అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజలతో పాటు కరోనా కాలంలో మానసిక ఒత్తిళ్ల నుండి బయట పడడానికి అనేక దుర్వ్యసనాలకు అలవాటైన యువత క్షణాలలో సులభమైన ఆంక్షలతో అప్పులు లభ్యమయ్యే మార్గం కనపడగానే పోలోమంటూ ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.

### లోన్ యాప్‌ల మోడస్ ఆపరేండీ ఇలా ఉంటుంది?

వందలూ, వేలాది ఉచిత లోన్ యాప్‌లను సృష్టించి గూగుల్ ప్లే స్టోర్లోకి అప్‌లోడ్ చేయడం.

మా లోన్ యాప్‌ని డౌన్ లోడ్ చేసుకున్న వారికి ఎలాంటి డాక్యుమెంట్లు అవసరం లేకుండా ఒక్క క్లిక్‌తో వారి అవసరాలకు సరిపడా నగదును వారి ఖాతాల్లోకి చేరుస్తామనే ఆకర్షణీయమైన హామీ ఇవ్వడం. ఆన్‌లైన్ లోన్ రుణాలకు వారిని బద్ధులను చేసే ఒప్పందంలో భాగస్వాములను చేయడం. లోన్ తీసుకునే సమయంలోనే తమ కాంటాక్ట్ లిస్ట్‌తో పాటు, ఫోటోలను, వీడియోలను సైతం షేర్ చేయడమే మెజారిటీ వేధింపులకు మూలంగా మారుతుందనే సైబర్ సెక్యూరిటీ నిపుణుడు సేవ్ దెమ్ ఇండియా ఫౌండేషన్ డైరెక్టర్ల ప్రవీణ్ కళై సెల్వన్ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే.

లోన్ జారీ చేసినప్పుడు మీ వెసులుబాటుకు అనుగుణంగానే రుణాలను తిరిగి చెల్లించవచ్చనే భ్రమను కలిగించి తీరా రుణం తీసుకున్న తర్వాత వెంటబడి వేధింపులకు గురి చేయడం షరా మామూలుగానే కొనసాగుతుంది. నిజానికి లోన్ తీసుకోకున్నా, ప్రమాదవశాత్తు తమకు తెలియకుండానే ఆకస్మికంగా సదరు లింక్‌పై చేసిన క్లిక్ పర్యవసానంగా యాప్ డౌన్ లోడ్ అయినప్పుడు వారి మొబైల్ నెంబర్‌తో వారి కాంటాక్ట్ లిస్టులో వున్న ఖాతాదారులందరి వివరాలకు యాక్సెస్ లభించిన మూలాన వారందరినీ ఏ లోన్ తీసుకోకున్నా మీరు తీసుకున్న లోన్‌ని వెంటనే తిరిగి చెల్లించాలని చేస్తున్న వేధింపులు ఆన్‌లైన్ నేరస్తుల దుష్కృత్యాలకు పరాకాష్టగా చెప్పక తప్పదు. ఇందుకు సజీవ ఉదాహరణగా పొరుగు రాష్ట్రంలో వున్న ఓ కేబినెట్ మంత్రి మరో మాజీ మంత్రి, శాసనసభ్యుడిపై లోన్ యాప్ ప్రతినిధులు చేసిన వేధింపుల వీడియోలు ఇంటర్‌నెట్‌లో వైరల్ అయిన విషయం గమనించినప్పుడు అత్యున్నత స్థాయి జీవితాలను గడుపుతున్న ప్రజా ప్రతినిధులూ, ఉన్నతాధికారులే ఫేక్ రుణ యాప్ వేధింపుల నుండి రక్షణ పొందలేని పరిస్థితుల్లో వుంటే ఇక సామాన్య ప్రజలకు ఏ దిక్కూ లేదనే కఠోర సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు.

మోసపూరిత లోన్ యాప్‌ల బాధితులూ, వారి కుటుంబ సభ్యుల ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ, అశ్లీల వీడియోలు, చిత్రాలను రూపొందించి వారి కాంటాక్ట్ లిస్ట్‌లో వున్న వారందరికీ షేర్ చేయడంతో పాటు సోషల్ మీడియాలో సైతం షేర్ చేస్తున్న వైనంతో తీవ్ర మనోవేదనకు గురైన బాధితులు వందల సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతుం డడం







గుండెలను కలిచివేస్తోంది.

### మహా నగరాల్లోనే కాదు ఏజెన్సీల వరకు విస్తరిస్తున్న నేర సామ్రాజ్యం!

ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ లాంటి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హబ్‌లుగా పేరు గాంచిన మహానగరాల్లో రోజూ వందల వేల సంఖ్యలో మోసపూరితమైన ఇన్‌స్టంట్ మనీ లోన్ యాప్‌లతో సైబర్ నేరగాళ్లు, మధ్య తరగతి, దిగువ మధ్య తరగతుల ప్రజలపై విరుచుకుపడుతున్న వైనం విభ్రాంతిని కలిగిస్తోంది.

సదరు నగర పౌరులుగా జీవించడానికి అవసరమైన నగదు మొత్తాలను ఒకే ఒక్క క్లిక్‌తో డౌన్‌లోడ్ చేసుకునే యాప్ మూలంగా అత్యంత సులభమైన నిబంధనలతో వేల నుండి లక్షల వరకు స్వల్పకాలిక రుణాలను పొందే అవకాశాలే వారిని సదరు నేర యాప్‌ల వలలో చిక్కుకోవడానికి దోహదం చేస్తున్నాయని చెప్పక తప్పదు. మరోవైపు ఈ దేశంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలైన ఏజెన్సీలు, గిరిజన తండాలలో సైతం సెల్ నెట్ వర్క్ వుంటే చాలు అమాయకులూ, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఆ ప్రాంత యువతను, సెల్‌ఫోన్ల లోకి వివిధ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా తమ తమ మోసపూరిత యాప్‌లతో నిర్వాహకులు తమ ఆన్‌లైన్ యాప్‌లతో ఆకర్షిస్తూ వారి జీవితాలతో చెలగాట మాడుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.

### ఆర్.బి.ఐ. నియంత్రణ చట్రం నుండి తప్పించుకుంటున్న అనేక లోన్ యాప్‌లు?

చైనా ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లతో మొదలై స్వదేశీ నేరగాళ్ల ప్రవేశంతో పతాక స్థాయికి చేరుకున్న రుణ యాప్‌ల నేరాలు మన దేశ కేంద్ర బ్యాంకు అయిన రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంత ప్రయత్నించినా,

ఈ మధ్య కాలంలో రాజు, నలభై మంది దొంగల పేరుతో ఓ హాండ్ బుక్‌ని విడుదల చేయడం ద్వారా సదరు నేరాల పట్ల ప్రజలను జాగృతం చేయడానికి ఎన్ని చైతన్య కార్యక్రమాలను చేపట్టినా మోసపూరిత యాప్‌ల నిర్వాహకుల దుష్కృత్యాల నుండి, వేధింపుల బారి నుండి ప్రజలను కాపాడలేకపోవడం బాధాకరం. మెజారిటీ లోన్ యాప్‌లు నేరుగా రిజిస్టరైన లేదా ప్రభుత్వ బ్యాంకుల ద్వారా కాకుండా థర్డ్ పార్టీల చేత నిర్వహించబడుతుండడంతో పాటు సదరు పార్టీలు సైతం వాట్సాప్ కాల్స్ ద్వారా, సిస్టమ్ ద్వారా రుణాలు తీసుకోగోరేవారిని సంప్రదిస్తున్న నేపథ్యంలో వారి ఐ.పి. అడ్రస్‌లను ట్రేస్ చేయడం అసాధ్యంగా మారుతోందన్న సైబర్ నేరాలను ఇన్వెస్ట్‌గేట్ చేసే




అధికారులు తెలియజేస్తుండడం గమనార్హం. ఈ విపత్కర పరిస్థితులను అధ్యయనం చేసిన దేశ ఆర్థిక మంత్రిత్వ శాఖ గత సంవత్సరం కేవలం మూడు నెలల కాలంలోనే 2500 పైచిలుకు ఫిర్యాదులు అందుకున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తక్షణమే అన్ని లోన్ యాప్‌లపై నిఘా పెట్టి మోసపూరిత లోన్ యాప్‌ల నిగ్గు తేల్చి వాటిని గూగుల్ ప్లే స్టోర్ నుండి తొలగించే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చిన ఫలితంగా ఈ సంవత్సరం మే గూగుల్ ప్లే స్టోర్ దాదాపు 2000ల లోన్ యాప్‌లను తొలగించడం గమనార్హం.

**ఆర్.బి.ఐ. నిషేధించిన చట్ట విరుద్ధమైన యాప్‌లలో మచ్చుకు కొన్ని..**

ఆర్.బి.ఐ. నిషేధించిన 1227 చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించిన లోన్ యాప్‌లలో మచ్చుకు కొన్నింటి వివరాలు: రూపీ వే, స్మార్ట్ పాకెట్, లైటో క్యాష్, రూపీ స్మార్ట్, మనీ ట్రీ, ఫ్లాష్ రూపీ, మ్యాజిక్ మనీ మోబీక్విక్, లోన్ ఫ్రేమ్, క్యాష్ కౌ, క్యాష్ ఫిష్ యాప్, క్యాష్ వైట్ యాప్, టొంటీ టొంటీ క్యాష్, మై క్రెడిట్, మింట్ క్యాష్‌డిప్, అలెగ్జాండ్రా లోన్, ది కంగారూ లోన్, లోన్ సేవా యాప్ లాంటి ఫేక్, చట్ట విరుద్ధమైన యాప్‌లను ఆర్.బి.ఐ. గుర్తించిన వైనాన్ని దేశంలోని ప్రాంతీయ, జాతీయ మీడియా విస్పష్టంగా ప్రకటించినప్పటికీ సదరు లోన్ యాప్‌లే కాదు.. ఆర్.బి.ఐ. నిఘాకు కూడా అందకుండా మరెన్నో ఫేక్ లోన్ యాప్‌లు వాటి మోసాల పరంపరతో ఇంటర్‌నెట్ వినియోగదారులను ఆర్థికంగా, మానసికంగా తీవ్ర వేధింపులకు గురి చేస్తూ వందల సంఖ్యలో లోన్ తీసుకున్న యువతను ఆత్మహత్యతలకు ప్రేరేపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

**మొబైల్ ఫోన్లలో వున్న ఇంటర్‌నెట్ సదుపాయమే లోన్ యాప్‌ల దోపిడీకి ఆజ్యం పోస్తుందా?**

పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా రమారమి వంద కోట్ల మంది ఈ దేశ ప్రజల రోజువారీ జీవితాల్లో భాగమైన మొబైల్ ఫోన్‌లు, అవి కలిగి వుండే ఇంటర్‌నెట్ సాదుపాయాలే పునాదులుగా రుణ యాప్‌ల దోపిడీకి తెర లేస్తుందని చెప్పక తప్పదు. అనాలోచితంగా చేసే ఒక్క క్లిక్ వారి జీవితాలను సర్వనాశనం చేస్తుంది. సిలికాన్ వాలీ ఆఫ్ ఇండియాగా పేరు గాంచిన బెంగళూరు లాంటి నగరంలో ప్రతిరోజూ జరుగుతున్న సైబర్ నేరాలలో ప్రతి పదింటిలో ఒక మోసపూరిత లోన్ యాప్‌లదే ఔతున్నందున సైబర్ నేరాల నిరోధక శాఖ ఉన్నతాధికారులు ఎన్నిసార్లు చెప్పినా సర్వీస్ ప్రొవైడర్లు తగిన నియంత్రణ చర్యలను తీసుకోకుండా నిర్లక్ష్యం వహించడం ఫలితంగా గూగుల్ ప్లే స్టోర్‌లో చొరబడుతున్న మోసపూరిత యాప్‌ల మూలంగా సదరు నేరాల పరంపర యధేచ్ఛగా కొనసాగుతుండడం దురదృష్టకరమే. ఫలితంగా ఉత్పత్తి శక్తిగా మారి కుటుంబ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవాల్సిన యువత ఈ మోసపూరిత యాప్‌ల దుర్మార్గాలకు బలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.

**ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

కృత్రిమ మేధస్సుతో సృష్టికే ప్రతి సృష్టి చేస్తున్న ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగం నేటి ప్రపంచ ప్రజల జీవితాలలో విడదీయలేని భాగంగా మారిన ఇంటర్‌నెట్




వైబ్ సైట్లను మరింత జాగరూకతతో తయారు చేసి సురక్షితమైన వెబ్ సైట్లనే వినియోగదారులకు అందుబాటులో వుంచాలి. అన్‌నోన్ లైన్ లింకులతో ఎట్టి పరిస్థితులలో యాక్సెస్ కారాదు. అన్ ఆథరైజ్డ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోరాదు. ఎలక్ట్రానిక్ డివైజ్ లేదా సోషల్ మీడియా ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌నే ఉపయోగించాలి. ఏదైనా మోసపూరిత లోన్ యాప్ బారిన పడి నగదు పోగొట్టుకొన్నా లేదా వేధింపులకు గురైనా తక్షణమే 112 నెంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదుని నమోదు చేయాలి. సైబర్ నేరాలలో సింహ భాగాన్ని మోసపూరితమైన రుణ యాప్‌లే ఆక్రమించుకుంటున్న నేపథ్యంలో సదరు యాప్‌ల పట్ల జాగరూకత వహించడానికి అవసరమైన ఆన్‌లైన్ నైపుణ్యాలను ఇంటర్ నెట్ వినియోగదారులకు అందించడానికి ఆర్.బి.ఐ. చొరవతో సైబర్ నేరాల నిరోధక శాఖ ద్వారా ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలి. ఆచరణలో సైబర్ క్రైమ్ శాఖలు ఐ.టి. వెబ్‌లుగా కొనసాగుతున్న పట్టణాలకే పరిమితమై పని చేస్తున్న నేపథ్యంలో మోసపూరిత లోన్ యాప్‌ల ఫిర్యాదులను మామూలు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో సైతం వెలుగులోకి వస్తున్న సదరు నేరాలపై విచారణ కోసం సాధారణ పోలీసుశాఖ కూడా ఫిర్యాదులను స్వీకరించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులను ఇవ్వాల్సిందే. యధేచ్ఛగా వివిధ రూపాల్లో ఇంటర్‌నెట్ వినియోగదారుల డేటాను దొంగిలించడాన్ని రెగ్యులేట్ చేసే ఓ శాశ్వత ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పరచడంతో అందుకవసరమైన సాంకేతికను సమకూర్చడంతో పాటు ప్రభుత్వాలు సైతం విధాన పరమైన తోడ్పాటునందించాలి. ❑



# ప్రదోష పూజ మహాత్మ్యం

ప్రతిరోజు ప్రాతః కాలంలో శ్రీ మహావిష్ణు ఆలయ సందర్శన, సాయం సంధ్యా సమయంలో శివ దర్శనం సర్వ శుభాలను కలిగిస్తాయని పురాణాలు, గ్రంథాలు, ఆధ్యాత్మిక మార్గదర్శకులు తెలుపుతున్నారు.
సకల జీవులను రక్షించేవాడు హృదయాన సిరులను ప్రసాదించే శ్రీ మహాలక్ష్మిని నిలుపుకొన్న శ్రీహరి దర్శనం ఇహలోక సుఖాలను, ప్రదోష సమయంలో లయకారుడైన మహేశ్వర దర్శనం సర్వపాపాలను తొలగించి మోక్షాన్ని ప్రసాదించేదిగా పేర్కొంటారు.
అందుకే శివాలయాలలో ప్రతినిత్యం జరిపే ప్రదోష కాల (సాయంత్రంపూట) పూజకు ప్రాధాన్యత అధికం. నెలకు రెండు సార్లు వచ్చే త్రయోదశి రోజున చేసే ప్రదోష పూజ అన్నింటికన్నా విశేషమైంది. సాయంత్రం సూర్యాస్తమయానికి ముందు గంటన్నర తరువాత గంట అంటే మొత్తం రెండున్నర గంటల కాలాన్ని ప్రదోష సమయం అంటారు.
ఈ ప్రదోష పూజ వ్రతం గురించి స్కాంద పురాణం, శివ పురాణాలలో పేర్కొనబడింది. అమావాస్యకు, పౌర్ణమికి రెండు రోజుల ముందు వచ్చే త్రయోదశి రోజున జరిపే ఈ ప్రదోష పూజలో శిలాద మహర్షి కుమారుడు పరమేశ్వరుని వాహనం అయిన నందీశ్వరునికే ప్రథమ పూజ.
దీనికి సంబంధించి అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. గరళ కంఠుడు లోక సంరక్షణ నిమిత్తం క్షీరసాగరం మథన సమయంలో ఉద్భవించిన హాలాహలాన్ని స్వీకరించి దాని ప్రభావంతో కించిత్తు మైకానికి లోనై సొమ్మసిల్లిపోయారట. అది చూసిన లోకాలన్నీ తల్లడిల్లిపోయాయట.
జగన్మాత పార్వతీదేవి జటాధరుని తన ఒడిలో ఉంచుకొని సపర్యలు చేశారట. తెప్పరిల్లిన సోమశేఖరుడు కనులు తెరిచిని సమస్త దేవతలకు, ఋషులకు, మహామునులకు, ప్రజలకు ఆనందం కలిగించిన శుభ సమయం త్రయోదశి నాటి సాయంత్రం.
నాటి నుండి ప్రతి త్రయోదశినాడు ప్రదోష పూజ చేయడం ఒక సంప్రదాయంగా ఆరంభించారు.
యోగమాయ నిద్ర నుండి మేల్కొని ప్రశాంత చిత్తంతో ఉండే భక్తసులభుడు పూజకు సంతృప్తిడై సర్వ మనోభీష్టాలను నెరవేరుస్తారన్నది భక్తుల విశ్వాసం.
మరో గాథ ప్రకారం రాక్షసుల చేతిలో ఓడిపోయిన దేవతలు శ్రీ మహావిష్ణువు సలహా మేరకు నందీశ్వరుని నాయకత్వంలో కైలాస గిరి చుట్టు ప్రదక్షిణం చేసి కైలాసనాథుని మెప్పించి ఆయన సహాయంతో రాక్షసుల మీద విజయం సాధించారట.
ఇలా ఈ పూజకు నేపథ్యమైన ఏ గాథ తీసుకొన్నా సంపూర్ణ శరణాగతి, భక్తి విశ్వాస భావంతో కూడిన దైవారాధన వలన సర్వాంతర్యామి కరుణా కటాక్షాలు పరిపూర్ణంగా పొందుతారని చెబుతాయి. అందువల్ల భక్తులు త్రయోదశి నాటి ప్రదోష వ్రతం, పూజ చేపట్టి తమ ఇహపర కోర్కెలను నెరవేర్చుకొని అంతిమంగా శివ సాన్నిధ్యం పొందుతున్నారు.
ఈ పూజ ప్రారంభం తిరుపతి-చెన్నై మార్గంలోని 'సురటపల్లి' అని అంటారు. హాలాహలాన్ని తాగిన హరుడు సేదతీరింది ఇక్కడే అని చెబుతారు. అందుకే ఎక్కడా లేని విధంగా ఇక్కడి ఆలయంలో అమ్మవారి ఒడిలో శిరస్సు ఉంచి సేద తీరుతున్న శయన శివుని దర్శించుకోవచ్చు. ఎన్నో ప్రత్యేకతలు ఈ ఆలయ సొంతం.
తెలుగునాట చాలా కొద్ది చోట్ల శ్రీకాళహస్తి(శ్రీ కాళహస్తి, సురుటపల్లి లాంటి తమిళనాడు ప్రభావం ఎక్కువగా ఉన్న ఆలయాల్లో జరుపుతుంటారు) తమిళనాడులోని అన్ని శివాలయాలలో శుక్లపక్ష, కృష్ణ పక్ష త్రయోదశినాడు ప్రదోష పూజ శాస్త్ర ప్రకారం రంగ రంగ వైభవంగా నిర్వహిస్తారు.
సాయంత్రం నాలుగు గంటలకు నందివాహనునికి ఎదురుగా ముఖ





మండపంలో కొలువై వుండే నందికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం చేస్తారు. ఒక్కో అభిషేకానికి ఒక్కో రకమైన ఫలితం ఉంటుందని శాస్త్రాలు తెలుపుతున్నాయి. పాలు-దీర్ఘాయువు; ఆవునెయ్యి-మోక్షం; పెరుగు-సత్సంతానం; తేనె-మధురమైన గొంతు; బియ్యపు పిండి/నూక-రుణవిముక్తి; చెరకురసం-ఆరోగ్యం; పంచామృతం-సిరిసంపదలు; నిమ్మరసం-అపమృత్యు భయం తొలగింపు; లేత కొబ్బరి బొండాం నీరు-సుఖశాంతులు; అన్నాభిషేకం-చక్రవర్తి యోగం; గంధం-లక్ష్మీ కటాక్షం; పంచదార-శత్రుత్వ నివారణ; విభూతి-సర్వపాపహరణం. నందికి, లింగరాజుకి(ఉత్సవమూర్తి అయిన నటరాజుకి కూడా అభిషేకాలు జరుపుతారు) అభిషేకాల అనంతరం సుందరంగా విభూతి, చందన, కుంకుమ లేపనాలతో వివిధ వర్ణ పుష్పాలతో నేత్ర పర్వంగా అలంకరిస్తారు.

తరువాత నంది వాహనం మీద ఆదిదంపతులు ఆలయ ప్రదక్షిణా పథంలో ఊరేగుతారు. ఆలయానికి మాడవీధులు ఉంటే ఆలయ వెలుపలి ప్రాకారంలో మాడవీధులలో ఊరేగుతారు. గ్రామస్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో దేవీ సమేత దేవరకి స్వాగతం పలుకుతారు.

సహజంగా గర్భాలయం చుట్టూ ప్రదక్షిణం చేస్తారు. కానీ ప్రదోష పూజ రోజున భక్తులు సోమస్కంద ప్రదక్షిణం చేస్తారు. అంటే ధ్వజస్థంభం వద్ద ప్రదక్షిణ ఆరంభించి గోముఖి వరకు వెళ్లి తిరిగి ధ్వజస్థంభం దాటి అప్రదక్షిణంగా గోముఖి దాకా వెళ్లాలి. ఒకసారి ఇలా చేస్తే అది ఒక సాధారణ ప్రదక్షిణానికి సమానం. ఇలా వారి వారి మనోభీష్టాల ప్రకారం భక్తులు ఈ ప్రదక్షిణలు చేస్తారు. ఆరోజే సోమస్కంద ప్రదక్షిణ చేయటానికి కారణం ఏమిటంటే పవిత్ర అభిషేక ద్రవ్యాలు గోముఖి గుండానే వెలుపలికి వస్తాయి కదా! వాటిని తొక్కడం లేదా దాటడం మహాపాపంగా భావించడమే. శైవ క్షేత్రాలలో నందీశ్వరుడు తప్పనిసరిగా దర్శనమిస్తారు. ఆయనకు ఉన్న ప్రాధాన్యత అంతా యింతా కాదు. తిరువణ్ణామలై లాంటి క్షేత్రాల్లో వివిధ ఆకారాలలో అంటే భారీ నుండి చిన్న నంది రూపాలు ప్రాకారానికి ఒకటి చొప్పున ఉంటాయి. తిరునల్వేలి, చిదంబరం, తంజావూరు, మధురై లాంటి చోట్ల కూడా భారీ నందీశ్వర రూపాలను చూడవచ్చు. తిరువణ్ణామలైలో ప్రతి ఒక్క నందీశ్వరుడు అరుణగిరి వైపుకి తిరిగి వుండటం ఆ గిరికున్న ప్రాధాన్యత తెలుపుతుంది.

త్రయోదశి ప్రదోషమే కాకుండా మహా ప్రదోషం పేరిట సంవత్సరానికి ఒకసారి నిర్వహిస్తారు. దీనిని మహాశివరాత్రికి ముందు మాఘమాసంలో అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో తమిళనాడులోని అన్ని శైవాలయాలలో నిర్వహిస్తారు.

శివ ప్రదోషమే కాక శని ప్రదోషం కూడా చేస్తారు. జాతకరీత్యా ఏలినాటి శని, అర్ధాష్టమ శని ప్రభావాలతో నిత్య జీవితంలో సమస్యలతో సతమతమయ్యే వారు అధికంగా ఈ శని ప్రదోషం జరుపుకొంటుంటారు. ఈ శని ప్రదోషాన్ని జరుపుకోవడానికి కారణం సర్వేశ్వరుడు గరళాన్ని స్వీకరించింది శనివారంనాడు. శనివారం శనికి ప్రీతిపాత్రమైన రోజు. అందువల్ల ఈ శని ప్రదోష పూజలు పెద్దలు ప్రవేశపెట్టారు. నవగ్రహాలకు అధిపతి నటరాజు.


భక్తులు ఆ రోజు ఉదయాన్నే తలస్నానం చేసి శివారాధన చేసుకొని, ఉపవాసం ఉండాలి. రోజంతా శివనామస్మరణ చేస్తూ ప్రశాంత చిత్తంతో గడపాలి. సాయంత్రం శివాలయంలో నిర్వహించే ప్రదోష అభిషేకాలు, అలంకరణలు, ఆది దంపతుల విహారం వీక్షించి, సోమస్కంద ప్రదక్షిణ చేసి చివరగా ప్రసాదం స్వీకరించి ఉపవాస దీక్ష విరమించాలి. ఈ వ్రతం వల్ల ఎలాంటి కోరికైనా నెరవేరుతుంది. కార్యజయం, జీవితం సిరిసంపదలతో సుఖంగా సాగిపోతుంది. సమస్త పాపాలు తొలగిపోతాయని తరతరాల నమ్మకం. తమిళనాడులో పర్యటించాలనే ఆలోచన వున్నవాళ్లు ఆ రోజుల్లో ఏదో ఒక త్రయోదశి ఉండేలా ప్రణాళిక రచించుకోవడం అంటే ప్రదోష పూజను చూసే భాగ్యం దక్కించుకోవడమే.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

**రచనలకు ఆహ్వానం**

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజ్ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.**

**రచనలు పంపించాల్సిన చిరునామా:**
**ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**
sunmagvaartha@gmail.com



## పుస్తక సమీక్ష

## 'మహానటుడు ఎన్.టి.ఆర్‌పై అక్షరనివాళి'



53 సంవత్సరాలుగా 'రసమయి' సంస్థను నిర్వహిస్తూ రచయితగా, కవిగా, పరిశోధకునిగా, బాలభవన్ సంచాలకులుగా, డా॥ఎం.కె.రాము ప్రసిద్ధులు. తెలుగు సినిమాకు రెండు కళ్లుగా ఎఎన్ఆర్-ఎన్.టి.ఆర్‌లను పేర్కొంటారు. పద్యపౌరాణిక చిత్రాలకు నందమూరి తారకరామారావు పెట్టింది పేరు. శ్రీరామునిగా, శ్రీకృష్ణుడుగా, భీష్ముడిగా, రావణునిగా, శ్రీవెంకటేశ్వరునిగా ఎన్‌టిఆర్ పాత్రలు ప్రజల్ల ఇప్పటికీ సుస్థిరంగా నిలిపోయాయి. నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్‌గా విజయవాడలో మహానాడు వైభవం, నందమూరితో రాము వ్యక్తిగత పరిచయాలు ఎన్నో సంగతులు, సంఘటనలు మరెన్నో అనుభవాల, అనుభూతుల పరిచయ దొంతరలు అద్భుతంగా అక్షరీకరించారు. ముఖ్యమంత్రిగా ఎన్.టి.ఆర్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఫొటోలు, వివరాలు, రసమయి చేసే సాంస్కృతిక కార్యక్రమాల్లో రామారావు పాల్గొన్న తీరు, ప్రసంగాలు విపులీకరణ అధ్యాయాలుగా ఇవ్వడం చాలాబాగుంది. అయితే చాలా సభలు ఏ సంవత్సరం ఏతేది ఎక్కడ (ఆడిటోరియం) జరిగింది కూడా ఇస్తే బాగుండేది. అలాగే ఎన్.టి.ఆర్ దాదాపు 300పైగా చిత్రాల్లో నటించారు. చైనా-పాక్‌యుద్ధం, తుపాను దివిసీమలో ఉప్పెనల్లో ఎన్‌టిఆర్ చేసిన సేవాకార్యక్రమాలు, విరాళాల సేకరణ, హైదరాబాద్ వచ్చాక సాంస్కృతిక సంస్థలకు ఆయన ఇచ్చిన చేయూతలాంటి అంశాలు రాస్తే బాగుండేది.


**(ఎన్.టి.ఆర్, రచన: డా॥ ఎం.కె.రాము, వెల: రూ100, ప్రతులకు: రసమయి, 1-4-880/2/36/1, గాంధీనగర్, నియర్ దేవీచౌక్, హైదరాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**

## మూడు దశాబ్దాల స్త్రీవాద కవిత్వం 'అపరాజిత'



తెలుగు భాషాశాస్త్రంలో పిహెచ్‌డి పట్టాపొంది అమెరికాలో స్థిరబడిన ప్రముఖ కవయిత్రి, రచయిత్రి డా.కె.గీత సంపాదకత్వంలో రికార్డు చేయబడిన మూడు దశాబ్దాల (1993-2022) స్త్రీవాద కవిత్వం 'అపరాజిత'. ఈ సంకలనంలో 93 మంది స్త్రీవాద కవయిత్రుల 168 కవితలు పొందుపరిచారు. తరతరాలుగా స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, హింస, పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీల దీన పరిస్థితులను ప్రతిఫలిస్తు రాసిన కవితలు ఈ ఉద్గ్రంధంలో చదవొచ్చు. గత నలభై ఏళ్లగా కొనసాగుతున్న స్త్రీవాద సాహిత్య ఉద్యమంలోని ఖాళీలను యిందలి కవిత్వం పూరిస్తుందని సంపాదకురాలి నమ్మకం. స్త్రీల రక్షణ కొరకు, వారి హక్కుల పరిరక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కఠిన చట్టాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న విషయం విదితమే. అయినప్పటికీ చట్టాలలోని లొసుగులను వినియోగించుకుని కొందరు మృగాళ్లు శిక్షల నుండి తప్పించుకుని తిరుగుతూనే వున్నారు. యిది నాణేనికి ఒకవైపు. మరోవైపు పరికిస్తే పురుషుల పట్ల స్త్రీల అఘాయిత్యాలు తక్కువేం కాదు. అమానవీయత, అనైతికత ఎంతగా విలయతాండవం చేస్తున్నాయో అనునిత్యం మాధ్యమాల్లో చూస్తునే వున్నాం. ఫలితంగా భార్యాబాధితుల సంఘాలు దేశమంతటా వెలుస్తున్నాయి. 'పురుషవాదం' బలపడ్తోంది. 'వాదం' ఏదయినా స్త్రీ, పురుషుల మధ్య వుండాల్సింది ఒకరిపట్ల మరొకరికి నమ్మకం. సాటి మనిషిగా గుర్తింపు. 'అహం' వీడితే సమస్త సమస్యలు దూదిపింజల్లా ఎగిరిపోతాయి. సమస్యను ఎత్తి ఎదుటి వారిని నిందించడం కాదు. పరిష్కారం కూడా సృజనకారులు సూచించాలి. **(అపరాజిత, రచన: డా.కె.గీత, వెల: రూ 250, ప్రతులకు: అన్నిబుక్‌హౌస్‌లలో)** **- రమణ వెలమకన్ని**

## తెలంగాణ నాటకరంగ చరిత్ర



తెలంగాణ నాటకరంగ చరిత్రలో నాటక రచయితలు, రచనలు, ప్రదర్శనలు, ప్రయోగాలు రచయిత తాటికొండాల నరసింహారావు గ్రంథస్తం చేసారు. నాటకరంగంతో అనుబంధం వుండటంతో రచయిత పేరెన్నికగన్న నాటకరంగ కృషీవలునిగా శ్రమించి చరిత్రకు అద్దంపట్టారు. తెలుగులో 160 ఏండ్ల నాటి నాటక సాహిత్యాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రబంధపద్యనాటకాల నుంచి ప్రస్తుత సాంఘిక ప్రక్రియల వరకు ప్రతిఫలింపచేసారు. వివిధరంగాలలో రాష్ట్రం అస్తిత్వం బలపడుతుండటం దృష్ట్యా వివిధ జిల్లాలలో నాటక సంస్థల ఆవిర్భావచరిత్ర, రంగస్థల కార్యశాలలు, నటులు, రచయితలు, యితర నాటక రంగ ప్రముఖుల సత్కృషి, ప్రతిభా విశేషాలు, సామాజిక చైతన్యం, మేలుకొలుపు, రంగప్రభావం పదిలపరచుకోవలసిన చారిత్రక అవసరం, నాటకరంగానికి సంబంధించి ఈ గ్రంథం బాధ్యతగా నిర్వర్తించింది. భారతవాక్యంలో పేర్కొన్నట్టు ఏ చరిత్రా సమగ్రచరిత్ర కాదు. జీవనదిలా చరిత్ర ప్రవహిస్తూనే వుంటుంది. ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవలసినదే. తెలంగాణ నాటకరంగ చరిత్రపై ప్రతిభా రచయితగా, కళాకారునిగా విస్తృత అధ్యయను, పరిశీలన, పరిశోధన చేసిన విజయవంతమైన తొలిగ్రంధం యిది.

**(తెలంగాణ నాటకరంగ చరిత్ర, రచన: తాటికొండాల నరసింహారావు, వెల: రూ300, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లలో)**

**- ఎర్రమిల్లి**

## నీతి ప్రభోదకాలు ఈ కథలు



నీతి నైరూప్యత, సారళ్యత, క్లుప్తతకు జన్నాభట్ల సింహాప్రసాద్ కథలు నిలువెత్తు సాక్ష్యాలు. సమాజంలో రోజురోజుకి పెరిగిపోతోన్న నకారాత్మక (నెగెటివ్) ధోరణిని నిరసిస్తూ, సమాజం పట్ల బాధ్యత ప్రేమ, అభిమానాలు, పెద్దలయెడల గౌరవం పెంచే కథలు ఇవి. ప్రస్తుత కథాసంపుటిలో 8 కథలు, ఒక నాటికలున్నాయి. చారిత్రక నవలా చక్రవర్తి డా॥ముదిగొండ శివప్రసాద్‌చే 'రచన సుందరం భాష సరళ వ్యావహారికం, ఇతివృత్తాలు ప్రభోదాత్మకం' అని కొని యాడబడిన ఈ కథల్లో భారత సనాతన జీవన విధానాల ప్రాము ఖ్యతను ముప్పు తెచ్చిన మెప్పు కథ చెబు తుంది. ఒక కళను అభ్యసించటానికి ఛాందసము వదిలిగురువుపై పూర్ణ విశ్వాసముంచవలేనని 'కలియుగ నిగమశర్మ' కథ చెబుతుంది. ధనపిపాసులను న్యాయన్యాయ విచక్షణ దండని, 'నేటి సామాజిక న్యాయం' చెబుతుంది. ఒకరిని సన్మార్గమున పెట్టుటకు పాపకార్యమైన ను పుణ్యమేనని 'పవిత్ర పాపం' చెబుతుంది. ఉపమానాల ఉప్మాతో 'రుచుల రంగేళి గుబాళింపు' కథ అలరిస్తుంది. ఒక గొర్రె స్వగతం 'అన్నీ మగమేలుకే' అన్న నీతిగరుపుతుంది. ఇదో వెరైటీ గాథ. సాహిత్య సజీవనదిలో మునకలు వేయించిన రచయితకు అభినందనలు.

**(జీవనది, రచన: జన్నాభట్ల నరసింహ ప్రసాద్, వెల: రూ200, ప్రతులకు: ఇ.నం.1-207, ఫ్లాట్ నెం.7, అరవిందనగర్, నాగారం, హైదరాబాద్-600083)** **- కూర చిదంబరం**

**కొన్ని చిత్రాలను ఏదో యథాలాపంగా చూస్తాం. మరికొన్ని చిత్రాలు మనల్ని మనసు పెట్టి చూసేలా చేస్తాయి. ఇలా మనసు పెట్టి చేసే చిత్రాలు చిత్రం చూస్తున్నంతసేపూ మనల్ని కట్టిపడేస్తాయి. ప్రతీ సీన్ కూడా కళ్లు ఎటూ తిప్పనీయదు. సమర్థవంతమైన నటీనటులు, సాంకేతిక వర్గం ఉంటే చిత్రం ఎన్ని సంవత్సరాలైనా జీవించే ఉంటుంది. అలాంటి అనుభూతిని కలిగించే చిత్రాల్లో మొదటి వరుసలో ఉండే చిత్రం 'రక్త సంబంధం'.**

# అజరామరం 'రక్త సంబంధం'

**తెలుగు** చలనచిత్ర రంగానికి 1955-80 సంవత్సరాల కాలాన్ని స్వర్ణ యుగంగా చెప్పుకోవచ్చు. ఈ కాలంలో విడుదలైన చిత్రాలు ఇప్పట్లా రంగులద్దుకోకపోయినా తెలుపు-నలుపులో వచ్చినా ఇప్పటికంటే ఎంతో ఆకర్షణీయంగా, ప్రతి ఫ్రేమ్ కూడా సంవత్సరాల తరబడి మన మనసుల్లో నిలిచిపోతుందన్నట్లు ఉండేవి. ఈ సీన్ అనవసరం, ఈ సీన్ బోర్ కొట్టింది.. అనే వ్యాఖ్యలు అప్పటి సినిమాల్లో చాలా అరుదుగా వినిపించేవి. ఇప్పటి సినిమాల్లో ఏదో ఒకటో రెండో సీన్లు ఆకట్టుకుంటే ఆ సినిమా విజయంలో ఆ రెండు సీన్లే కీలక భూమిక పోషిస్తాయి. కానీ అప్పటి సినిమాల్లో ప్రతి సీనూ ఆచి తూచి కొలిచినట్లుగా ఒకదానికంటే మరొకటి తీసిపోని విధంగా ఉండేది. అందుకే బ్లాక్ అండ్ వైట్ సినిమాలైనా అవి ఇప్పటి రంగుల చిత్రాలను మించి ప్రేక్షకుల్ని ఆకర్షిస్తున్నాయి. ఇక 'రక్త సంబంధం' విషయానికి వస్తే ఈ వ్యాసం రాసేటప్పుడు ఒకసారి యూట్యూబ్‌లో సినిమాను పరిశీలించేందుకు ఆపరేట్ చేస్తే రెండు లక్షల ఇరవై వేల మంది ప్రేక్షకులు చూసినట్లుగా నమోదైంది. విడుదలై అరవై ఏళ్లకు చేరుకుని షష్ఠిపూర్తికి చేరువలో ఉన్న/చేసుకుంటున్న ఈ చిత్రాన్ని ఇప్పటికే ఇంత మంది వీక్షించారంటే అప్పటి చిత్రాల్లో ఉన్న విశిష్టత తెలుస్తోంది.
అప్పటి చిత్రాల్లో కూడా అన్నీ విజయవంతమయ్యాయయని కాదు.



కొన్ని చిత్రాలను కేవలం పాటల కోసమే చూసేవారు. మరికొన్నిటిని కథాబలం ఉందని తెలిస్తే వీక్షించేవారు. కానీ 'రక్త సంబంధం' అలా కాదు. అటు కథాబలం, ఇటు పాటలు ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది. వీటికితోడు ఎన్.టి.రామారావు, సావిత్రి అన్నా చెల్లెళ్లుగా చేసిన అభినయం చూసిన వారి మనసు బరువెక్కక మానదు. ఇక కథా పరంగా చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన రాజు(ఎన్టీఆర్) చెల్లెలు రాధ(సావిత్రి)ని ఎంతో అపురూపంగా పెంచుతాడు. అన్నా చెల్లెళ్ల అనుబంధం అంటే ఈ చిత్రం విడుదలైన రోజుల్లో ప్రతి ఇంటికీ ఆదర్శంగా నిలిచింది. తరువాత రోజుల నుంచి అన్నా చెల్లెలు అనుబంధం, ఆత్మీయతలపై వచ్చిన సినిమాలన్నింటికీ ఈ చిత్రం ఒక సోపానంగా నిలిచింది. అన్నాచెల్లెళ్ల అనుబంధంపై తీసిన సినిమాలు కచ్చితంగా విజయవంతమవుతాయని ఈ చిత్రం ఒక రోల్‌మోడల్‌గా నిలిచింది. కథ విషయానికొస్తే- తమది విడదీయరాని రక్త సంబంధమని ఆ అన్నాచెల్లెళ్లు భావిస్తారు. కానీ కొన్ని అనూహ్య పరిస్థితుల కారణంగా తన యావదాస్తిని చెల్లెలికి అప్పజెప్పి అన్న దేశాంతరం వెళ్లిపోతాడు. చివరి రోజుల్లో మళ్లీ చెల్లెలు కోసం తిరిగొచ్చి ఆ చెల్లెలు చేతిలోనే చెయ్యి వేసి మరణిస్తాడు. అన్న మరణాన్ని తట్టుకోలేక చెల్లెలు కూడా మరణిస్తుంది. తమది విడదీయరాని రక్త సంబంధం అని తలచిన ఆ ఇద్దరూ ఇలా చనిపోవడం రెండు శరీరాలతో ఉన్నప్పటికీ తమది ఒకే ఆత్మ అని చెప్పకనే చెప్పినట్లవుతుంది ఈ ముగింపుతో. ఈ చిత్రానికి మాతృక తమిళంలో శివాజీ గణేశన్, సావిత్రి నటించిన 'పాశుమలర్' మూలం. ఈ చిత్రంలో సావిత్రి భర్తగా జెమినీ గణేశన్ నటించారు. రక్త సంబంధంలో ఆ పాత్రను కాంతారావు ధరించారు. పాశుమలర్ అంటే ఆరాధించే పుష్పం అని అర్థం. ఈ చిత్రాన్ని చూసిన ప్రముఖ నిర్మాత దూండీ(పూర్తి దూండేశ్వరరావు... దూండీ అని పిలిచేవారు). తెలుగులో తీయాలని ముచ్చట పడ్డారు. 1921లో బెజవాడలో పోతిన బ్రదర్స్ ఇద్దరూ మారుతీ టాకీస్‌ను నిర్మించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన మొదటి సినిమా హాలుగా ప్రసిద్ధి గాంచిన ఆ హాలు ఇప్పుడు కాలగర్భంలో కలిసిపోయింది. పోతిన శ్రీనివాసరావు, గణపతి పాత్రుడు ఈ హాలును నిర్మించారు. దీనిని దూండీ సోదరుడు నిర్వహించేవారు. దూండీ మద్రాసులో(ఇప్పుడు చెన్నై) చదువుతుండే వారు. ఆయనకు కేర్ టేకర్లుగా అక్కినేని నాగేశ్వరరావు, సుందర్‌లాల్ నహాతా ఉండేవారు. దూండీకి చుట్టూ సినిమా ప్రపంచం.. ఎక్కడికెళ్లినా ఆ పరిశ్రమతో సంబంధం ఉన్నవారే కలుస్తుండడంతో ఆయనకు కూడా సినిమా రంగంపై దృష్టి పడింది.

ఈ దశలో ఒక తమిళ చిత్రం హక్కులు కొని, దాన్ని తెలుగులో డబ్బింగ్ చేసి, విడుదల చేయగా ఘన విజయం సాధించింది. తరువాత శివాజీ, సావిత్రి నటించిన 'పాశమలర్' చిత్రాన్ని చూసి దాన్ని తెలుగులో నిర్మించాలని నిర్ణయించుకుని సుందర్‌లాల్ నహతాతో చర్చించారు. ఆయన కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో శివాజీ స్థానంలో అక్కినేనిని తీసుకోవాలని ఆయనతో ఉన్న చనువుకొద్దీ వెళ్లి అడిగాడు దూండీ. అయితే అప్పటికే సావిత్రి, అక్కినేని జంటగా పలు సినిమాలు విజయవంతమయ్యాయి. దాంతో తాను, సావిత్రి అన్నా చెల్లెళ్లుగా వేస్తే జనం ఆదరించరేమోనని అనుమానపడడమే కాకుండా ఎన్.టి.రామారావు పేరును సూచించారు. నాగేశ్వరరావు సలహా మేరకు దూండీ ఎన్.టి.రామారావు సంప్రదించారు. చిత్రంలో తన పాత్ర గురించి తెలుసుకున్న రామారావు ఆ పాత్రలో నటనకు ఎక్కువ అవకాశం ఉండడంతో నటించేందుకు అంగీకరించారు. తమిళంలో నటించిన సావిత్రినే అదే పాత్రకు ఎంపిక చేసుకున్నారు. జెమినీ గణేశన్ స్థానంలో కాంతారావు వచ్చారు. ఎంతో బరువైన కథతో ఆద్యంతం సెంటిమెంట్‌కు ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు రచనా సామర్థ్యం ఉన్న వ్యక్తి ఆచార్య ఆత్రేయ. ఆ రోజుల్లో ఆయన తప్ప మరొకరు ఇటువంటి కథకు రచనా బాధ్యతలు చేపట్టేవాళ్లు లేరు. కానీ ఆయన ఇతర చిత్రాలతో బిజీగా ఉండడంతో ఆయన స్థానంలో అకస్మాత్తుగా ముళ్లపూడి వెంకటరమణ వచ్చారు. దూండీ ముళ్లపూడిని రచయితగా ఎంపిక చేసుకోవడం అప్పట్లో తీవ్ర సంచలనానికి దారి తీసింది. అంతవరకు ఆయనకు సినిమాకు రాసిన అనుభవం లేదు. పైగా హాస్య రచయితగా పేరుపడిన వ్యక్తిని ఇటువంటి బరువైన కథాంశం ఉన్న చిత్రానికి ఎంపిక చేయడం పట్ల చాలామంది పెదవి విరిచారు. అయితే ఎన్టీఆరే హీరోగా ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో తయారు కానున్న 'దాగుడు మూతలు' ఎందుకో వాయిదా పడడంతో రక్తసంబంధమే ఆయనకు మొదటి సినిమాగా నిలిచింది. రక్త సంబంధం సినిమాకు అంగీకరించే ముందు నిర్మాత డి.బి.నారాయణ అనుమతి తీసుకుని రక్త సంబంధం చిత్ర రచనకు ఉపక్రమించారు. ఆ రోజుల్లో విలువలు అలా ఉండేవి. దాగుడు మూతలు సినిమా సమయంలో ముళ్లపూడితో ముందస్తు ఒప్పందం లేదు. అదే విషయాన్ని నారాయణ కూడా ముళ్లపూడితో అనడం అప్పటి వ్యక్తులు ఎంత మర్యాదగా విలువల్ని కాపాడుకునేవారో అర్థం చేసుకోవాలి. సినిమా కథల్లోనే కాదు, వ్యక్తుల్లోనూ విలువలుండడం వల్ల అంత మంచి చిత్రాలను చూసే అవకాశం మనకు కలిగింది. ముళ్లపూడికి కూడా తనపై హాస్యపు ముద్ర నుంచి బయట పడేందుకు ఈ 'రక్త సంబంధం' ఎంతో ఉపయోగపడింది.

భారీ నాటకీయత, శోకభరితమైన సన్నివేశాలు ఉన్న హెవీ డ్రామాకు న్యాయం చేయడంలో కృతకృత్యులయ్యారు ముళ్లపూడి. ఆయన రాసిన పలు సన్నివేశాల్లోని సంభాషణలకు ప్రేక్షకులు హర్షధ్వానాలతో అభినందనలు తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిపోతున్న రాజును చూసి కన్నీళ్లు ఆపుకోలేకపోతున్న చెల్లెలితో "నేను నిన్న వదిలి వెళ్లడం లేదమ్మా, ఇల్లు వదిలి వెళ్తున్నానంతే" అని పలికిస్తారు ముళ్లపూడి. ఇటువంటి హృదయాన్ని పట్టేసే  కొన్ని సన్నివేశాల్లో సావిత్రి లీనమై నటిస్తుండడం చూసి ఆ సన్నివేశంలో తాను చెప్పాల్సిన సంభాషణలను సూర్యకాంతం మరిచిపోయి కన్నీళ్లతో నిలబడిపోయేవారట. ఒక దశలో సావిత్రి నటనకు ఆమె జేజేలు పలుకుతూ తాను నటించలేననీ, చిత్రం నుంచి తప్పుకునేందుకు కూడా సిద్ధపడ్డారట. దర్శక, నిర్మాతలు సర్దిచెప్పడంతో సూర్యకాంతం మౌనం వహించారట. కథ విషయానికి వస్తే– రాజు(ఎన్టీఆర్) జీవితం అతని సోదని సోదరి రాధ(సావిత్రి) చుట్టూ తిరుగుతుంది. ఉద్యోగం పోయిన తర్వాత, రాజు కుటీర పరిశ్రమను ప్రారంభించాడు. చివరికి అతను పనిచేసిన ఫ్యాక్టరీని కొనుగోలు చేస్తాడు. అతను ధనవంతుడు భాస్కర్(ప్రభాకర రెడ్డి)తో రాధ పెళ్లిని ఫిక్స్ చేస్తాడు. అందుకు ప్రతిగా భాస్కర్ చెల్లెలు డాక్టర్ మాలతి(దేవిక)ని తాను చేసుకునేందుకు అంగీకరిస్తాడు రాజు. కానీ అనూహ్యంగా రాధను సంతోషపెట్టడానికి తన మాజీ సహోద్యోగి ఆనంద్(కాంతారావు)తో ఆమె వివాహం జరిపిస్తాడు. పెళ్లి తర్వాత ఆనంద్ తన అత్త కాంతమ్మ(సూర్యకాంతం), ఆమె కుమారుడు అప్పారావు(రేలంగి), కోడలు సీత(గిరిజ)తో కలిసి రాజు ఇంట్లో ఉంటాడు. మాలతితో రాజు పెళ్లి చేయడానికి రాధ జోక్యం చేసుకుంటుంది. దుర్బుద్ధి గల కాంతమ్మ కుటుంబంలో చీలిక తీసుకొస్తుంది. ప్రసవ సమయంలో మాలతి మరణించిన తర్వాత రాజు ఇంటిని విడిచి పెట్టేలా చేస్తుంది. సంవత్సరాలు గడిచిపోతున్నాయి. ఆరోగ్యం బాగాలేని రాజు తన చెల్లెలిని తన కూతురితో చూడడానికి తిరిగి వస్తాడు. కానీ కాంతమ్మ ఇంట్లోకి రానివ్వకుండా బయటి నుంచే పంపించి వేస్తుంది. టపాకాయల పేలుడు నుండి రాధ కొడుకును కాపాడుతుండగా రాజు కంటిచూపు కోల్పోతాడు. రాధ రాజును కలవడానికి చేరుకునే సమయానికి అతను తుదిశ్వాస విడుస్తాడు. ఎడబాటు తట్టుకోలేక రాధ కూడా అతని చెయ్యి పట్టుకుని చనిపోతుంది. ప్రఖ్యాత మలయాళ రచయిత, స్క్రిప్ట్ రైటర్ కె.పి.కొట్టారక్కర అన్నా చెల్లెళ్ల బంధంపై రాసిన కథ దర్శకుడు ఎ.భీంసింగ్‌కు నచ్చింది. దాన్ని ఆయన తమిళంలో సెల్యులాయిడ్ క్లాసిక్‌గా మార్చారు. తెలుగులో ఆయన స్థానంలో వి.మధుసూదనరావు దర్శకుడిగా వచ్చారు. మధుసూదనరావులో ఉన్న ప్రతిభ ఏమిటంటే, ఒక సన్నివేశం నుండి మరొక సన్నివేశానికి కుదుపులు, జిమ్మిక్కులు లేకుండా సాఫీగా మార్చడం. దీనివల్ల సినిమాను చూసే ప్రేక్షకుడు ఎక్కడా విసుగు చెందడు. ఆయన ఇతర సినిమాల్లో కూడా ఇదే టాలెంట్ కనిపిస్తుంది. తన కాల్పనిక పాత్రలు దీర్ఘకాలిక రుణ గ్రహీత అప్పారావు, అతని ప్రేమమూర్తి, బాపు చిత్రాల ద్వారా అమరత్వం పొందిన రెండు జడల సీతను పరిచయం చేశారు. రేలంగి, గిరిజ ఎమోషనల్ డ్రామాకి తేలికైన  క్షణాలను తీసుకువచ్చే పాత్రలు పోషించారు. గిరిజ తండ్రిగా రమణారెడ్డి, ఫ్యాక్టరీ యజమానికి కె.వి.ఎస్.శర్మ, సేవకుడు సుబ్బన్నగా వై.వి.రాజు నటించారు. ఈ పాత్రను అత్యద్భుతంగా రాజబాబు పోషించారు. నాటి నటీనటులు, సాంకేతిక సిబ్బంది నేడు మన కళ్లెదుట లేకపోయినా వారు పోషించిన పాత్రలు, చూపించిన సాంకేతిక నైపుణ్యం ద్వారా ఆనాటి చిత్రాలతో మనకు కనువిందు చేస్తూనే ఉన్నారు. వారిలోని ప్రతిభను గుర్తించి తగిన ప్రోత్సాహకాలు కల్పించిన దర్శక, నిర్మాతల కు ప్రేక్షకులతో పాటు చలనచిత్ర రంగం కూడా రుణపడి ఉంటుంది.

**- తాడేపల్లి శివరామకృష్ణారావు**

కథ

# నాగమణి మహిమ

**అవంతి** రాజ్యంలో వీరయ్య అనే నిరుపేద ఉండేవాడు. అతడు ప్రతిరోజు అడవికి వెళ్లి వెదురు పొదలను నరికి, వాటితో వెదురుబుట్టలు తయారు చేసేవాడు. వాటిని చుట్టుపక్కల గ్రామాలలో అమ్మి పొట్ట నింపుకొనేవాడు.

ఒకరోజు వీరయ్య అడవికి వెళ్లి, వెదురుపొదలను నరకడం మొదలుపెట్టాడు.



ఇంతలో బుసలు కొడుతున్న పాము శబ్దం వినిపించింది. పొదల మధ్యకు చూసిన వీరయ్యకు తలపైన నాగమణి వున్న దేవతాసర్పం కనిపించింది. అది మానవ భాషలో "వీరయ్యా! ఈ వెదురుపొదలు మా నాగజాతికి నివాసం, అలాంటి మా నివాసం నాశనం చేయవద్దని వేడుకొంది. దానికి ప్రతిఫలంగా నాగమణిని ఇస్తానని చెప్పింది. ఈ నాగమణిని పూజించి భక్తితో వేడితే నేను ప్రత్యక్షమై నీ కోరికలు తీరుస్తానని" చెప్పింది.

వీరయ్య ఆ నాగమణిని బట్టలో చుట్టి తన నడుమున దోపుకున్నాడు. వీరయ్య ఇంటికి వెళ్లి ఆ నాగమణిని తన పూజా మందిరంలో ఒక పెట్టెలో భద్రపరిచాడు.

ఒక శుభ దినాన ఆ నాగమణికి పూజలు చేసి తనకు అందమైన భవనం కావాలని మనసులో కోరుకున్నాడు. నాగదేవత ప్రత్యక్షమై అతని కోరిక తీర్చింది. నాగమణి మహిమతో ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించి వీరయ్య మంచి పేరు సంపాదించాడు.

ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడి అదే రాజ్యంలో నివసిస్తున్న గజదొంగ గంగయ్యకు తెలిసింది. గంగయ్య ఒకరోజు రాత్రి వీరయ్య ఇంటికి కన్నం వేసి ఆ నాగమణిని దొంగిలించి తన ఇంట్లో దాచిపెట్టాడు.

మరుసటి రోజు దొంగతనానికి వెళ్లిన గంగయ్యను మాటు వేసిన రాజభటులు బంధించి చెరసాలలో వేసారు.

ఇది తెలిసి గంగయ్య భార్య నాగమణిని దొంగిలించడం వల్లనే ఈ అనర్థం జరిగిందని భావించి వీరయ్యకు నాగమణిని తిరిగి ఇచ్చేసింది.


వీరయ్య నాగమణి తన వద్ద ఉండటం తన ప్రాణాలకు సైతం ముప్పని గ్రహించి ఆ రాజ్యాన్ని పాలించే రాజు మహేంద్ర వర్మకు ఆ నాగమణిని ఇచ్చాడు. మహేంద్రవర్మ వీరయ్య ధర్మబుద్ధి మెచ్చుకొని, ఘనంగా సన్మానించి, విలువైన కానుకలు అందించాడు.

రాజు ఆ నాగమణిని, ప్రజా శ్రేయస్సుకు ఉపయోగించి, జనరంజకమైన పాలన సాగించాడు. జనుల మెప్పు పొందాడు.

నీతి: ప్రతి వ్యక్తి ధర్మబుద్ధితో మెలగాలి.


**- దాసరి చంద్రమోహన్**

## రంగులు వేయండి



## బాలగేయం

### అందాల మొగ్గలు



చిట్టిపొట్టి పాపలు
అందాల మొగ్గలు
చిరునవ్వే కోటిదీపాలు
కల్మషం లేని మనసులు
పాలబుగ్గల తీగెలు
సన్నజాజి తెలుపు
ఉప్పొంగే కెరటాల
చెంత ఆడుకునే నేస్తాలు
ఇసుక బాటపై
అక్షరాల సొగసులు
చదువుపై మక్కువ
అమ్మఒడిలోనే
పసికూనల ప్రపంచం
అయినా బడికి
త్వరత్వరగా వెళ్తాం
చక్కగా చదువుకుని
అందరికీ గౌరవంగా
నిలుస్తాం

- సండే డెస్క్


## హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

### గిరీష్ అంకుల్ సమాధానాలు

- కె.ఆర్.మణికంఠ, హైదరాబాద్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వాతావరణం వలన కలిగే అతి ముఖ్యమైన ప్రయోజనం ఏమిటి?**



**జవాబు: మణికంఠ!** భూమండలం మీద జీవకోటిని రక్షిస్తున్నది వాతావరణమే. సూర్యకిరణాల వేడిమికి జీవరాశి నశించకుండా వాతావరణం రక్షిస్తుంది. సూర్యుడు అస్తమించగానే భూమి మీద వేడి తగ్గిపోకుండా వాతావరణం అడ్డగిస్తుంది. వాతావరణం వేడిమిని అడ్డగించని పక్షంలో సూర్యాస్తమయం కాగానే విపరీతమైన శీతలం భూమండలాన్ని ఆవరించే అవకాశం ఉంది. ఇక నష్టాలంటారా? మనం కోరి తెచ్చుకున్నవేగానీ, ప్రకృతిరీత్యా వాతావరణం జీవరాశికి మేలు చేకూర్చేదే.
ఈ వాతావరణం ద్వారానే గాలులు నిరంతరం కదులుతూ వుంటాయి. గాలులను కలుషితం చేసిన ఘనత మానవాళిదే!

- పి.వాగ్దేవి, విజయనగరం

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కీటకాలకు చెవులుంటాయా?**

**జవాబు: వాగ్దేవి!** మనకున్నట్లు క్రిమికీటకాలకు చెవులుండవు. అయినప్పటికీ అవి ధ్వనిని గ్రహించగలుగుతాయి. మన చెవిలో వినికిడికి అవసరమైన 'ఇయర్ డ్రమ్' వున్న తరహాలోనే వాటి శరీరంలో 'టింఫానిక్ లేయర్' (వినికిడిశక్తి గల పొరగా చెప్పుకోవాలి) ఉంటుందని శాస్త్రవేత్తలు వివరించారు. ఆ వివరాల ప్రకారం వినికిడికి ఉపయోగపడే ఈ టింఫానిక్ లేయర్ కొన్ని కీటకాల్లో బాహ్య అస్థిపంజరంలో ఉంటుంది. మరికొన్నింటిలో ముందుకాళ్లల్లోగానీ, ఉదరం కిందగానీ ఉంటుంది. కొన్ని కీటకాలలో అయితే ప్రత్యేకంగా వాటి చర్మం మీద వున్న వెంట్రుకలే శబ్దాలను వినగలవు.

# ఆహార వృధాను అరికట్టాలి!

**మంచి** తిండి తిని మనిషి ఆరోగ్యంగా ఉన్నపుడే దేశ పురోగతికి పాటుపడ తాడు. అందుకే ప్రముఖ కవి గురజాడ అప్పారావు "తిండి కలిగితే కండ కలదోయ్, కండ కలవాడే మనిషోయ్" అన్నారు. మనం ఆహారం కోసం పంటలపై, చెట్లపై, పశువులపై, జల వనరులపై ఆధారపడవలసి ఉంటుంది.

భూమిపై ఉన్న ప్రతి జీవరాశి బతకడానికి ఆహారం తీసుకో వాలి. ఆహారం అనేది మనిషి ప్రాథమిక అవసరాలలో అతి ముఖ్యమైంది.



అన్నపూర్ణ దేశంగా పిలువబడిన మన దేశంలోనూ నేటికీ చాలా మంది బతకడానికి కావలసిన కనీస ఆహార పదార్థాలను కూడా పొందలేకపోతున్నారు. మన దేశమే కాకుండా ప్రపంచంలోని చాలా దేశాలు ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యలలో ఆహార కొరత ఒకటి. ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచంలో ఇంకా 25 శాతం దేశాలు పేదరికం, ఆకలిని అనుభవిస్తున్నాయి. ఆహార కొరత తీరాలంటే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలి. ఈ భూమిపై వ్యవసాయానికి అనుకూలమైన విశాల భూభాగం వున్నప్పటికీ అనేక కారణాల వలన వ్యవసాయ భూమినంతా మనం సాగు చేసుకోలేకపోతున్నాం. ఆహారోత్పత్తి కంటే జనాభా పెరుగుదల అధికంగా ఉండటం వలన ఆహార సమస్య మరింత తీవ్ర రూపం దాలుస్తున్నది. మన దేశంలో సుమారు డెబ్బై శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ క్రమ క్రమంగా వ్యవసాయం లాభసాటిగా లేకపోవడం వల్ల వారంతా ఇతర వృత్తుల వైపు వెళ్తున్నారు. తద్వారా పంట పండించే రైతన్నల సంఖ్య తగ్గుముఖం పడుతుంది. అందరికీ అన్నం పెట్టే రైతన్నకే అన్నం దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. రైతుకు మంచి విత్తనాలు ఎరువులు, నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించి పండిన పంటకు గిట్టుబాటు ధరలను పొందేలా చూడాలి. పండిన పంటకు మంచి ధర వచ్చే వరకు నిల్వ చేసుకునే విధంగా గోదాములను ఏర్పాటు చేయాలి. రైతే పంట ధరను నిర్ణయించి తాను పండించిన పంటను అమ్ముకునే పరిస్థితి రావాలి. దళారి వ్యవస్థ ఉండకూడదు. అప్పుడే మధ్య తరగతి ప్రజలకు కూడా నిత్యావసర వస్తువుల ధరలు అందుబాట్లోకి వస్తాయి. వాణిజ్య పంటలకంటే ఆహార పంటలకు ప్రాధాన్యం ఇచ్చినట్లయితే ఆహార కొరత కొంతమేర తీరుతుంది. సరైన ప్రణాళికతో రెండు, మూడు పంటలు కూడా పండించవచ్చు. మిశ్రమ పంటలు, సేంద్రీయ వ్యవసాయం పట్ల రైతులకు అవగాహన కల్పించాలి. అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు పండక ఉత్పత్తి తగ్గుతుంది. భూసారాన్ని పరిరక్షించకపోవడం, అధిక రసాయనిక ఎరువులు వాడటం ద్వారా రాను రాను పంటల దిగుబడి తగ్గుతుంది. అంతేకాక వ్యాపారస్తులు ఆహార పదార్థాల కృత్రిమ కొరతను సృష్టించడం ద్వారా వాటి ధరలను పెంచుతున్నారు. ఆధునిక కాలంలో సామాన్య ప్రజలకు ఆహార ధాన్యాల ధరలు అందు బాటులో లేవు. ఉల్లి, టమాట మొదలు అనేక నిత్యావసర వస్తువుల ధర లు రోజురోజుకూ పెరుగు తూనే ఉన్నాయి. దిగువ మధ్య తరగతి వారికి కూడా ఆహార ధాన్యాలు అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వమే కొన్ని రాయితీలు కల్పించి ధరలు నిలకడగా ఉంచవచ్చు. ఆహార కొరత నివారణకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి. కూలీల కొరతను అధిగమించడానికి, వ్యవసాయ ఉత్పత్తులను పెంచడానికి, సేద్యంలో ఆధునిక పద్ధతులను, యాంత్రికీకరణను ప్రవేశపెట్టాలి. వ్యవసాయ పరిశోధనా లయాలను పెంచి పరిశోధనలకు పెద్ద పీట వేస్తూ అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలను కనుగొనేలా



ప్రోత్సహించాలి. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి పెరగాలి. రైతులకు సులభ పద్ధతిలో రుణ సౌకర్యం కల్పించి, రైతుల ఆత్మహత్యలను నివారించాలి. సహకార సంఘాలలో, మార్కెట్ కమిటీలలో సంస్కరణలు చేపట్టి వాటిని రైతులకు మరింత అందుబాటులోకి తేవాలి. వ్యవసాయాన్ని పాఠ్యాంశంగా చేర్చడం ద్వారా వ్యవసాయం పట్ల రాబోయే తరాలకు అవగాహన కల్పించాలి. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చి యువకులు "మేం ఉద్యోగం చేస్తాం" అనే స్థాయి నుండి "వ్యవసాయం చేస్తాం" అనే స్థాయికి ఎదిగేలా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలి. చౌకధరల దుకాణం ద్వారా బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను, చిరు ధాన్యాలను దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి సబ్సిడీపై అందించాలి. ఎంతో మంది బడి ఈడు పిల్లలు కూడా నేడు పోషకాహార లోపంతో బాధపడుతూ వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారు. బడిలోనే కూరగాయలు పండించి విద్యార్థులకు తాజా కూరగాయలతో కూడిన మధ్యాహ్న భోజనం అందేలా ఏర్పాటు చేయాలి. ఎవరి ఇంటివద్ద వారు కూరగాయలు, ఆకుకూరల తోటలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రజలందరికీ ఆహారం అందించాలంటే ఆహార ధాన్యాల ఉత్పత్తిని, పాడి సంపదను, మత్స్య సంపదను, కోళ్లను పెంచాలి.
ఆహార, వ్యవసాయ నివేదిక ప్రకారం ప్రపంచంలో మూడింట ఒక వంతు ఆహారం వృధా అవుతుంది. వివాహ మహోత్సవాలలో, ఇతర ఫంక్షన్లలో, హోటళ్లలో ఆహార పదార్థాలను కావలసిన దానికంటే ఎక్కువ వేసుకొని వృధా చేస్తున్నాం. ఆహార సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాలకు ప్రజలంతా సహకరిస్తూ ఆహార పదార్థాల వృధాను అరికట్టినపుడే అర్ధాకలితో అలమటించేవారి ఆకలి తీరుతుంది. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" మనం వృధాగా పడేసిన ఆహారం మరొకరి ఆకలిని తీరుస్తుందనే విషయాన్ని గుర్తెరగాలి. హోటళ్లలో, వేడుకలలో మిగిలిన ఆహార పదార్థాలను ఆశ్రమాలకు, అనాథ శరణాలకు పంపించే ఏర్పాటు చేయాలి. ఆహార కొరత ప్రాధాన్యతను గుర్తించిన ఐక్యరాజ్య సమితి తన అనుబంధ సంస్థ అయిన ఆహార, వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏఒ) ద్వారా ప్రపంచ ప్రజలందరికీ పౌష్టికాహారం అందించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఆహార వ్యవసాయ దిగుబడులను పెంచడం లక్ష్యంగా పని చేస్తుంది. అందుకే ఈ సంస్థ ఏర్పడిన అక్టోబర్ 16ను ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా నిర్వహిస్తూ 1981 నుండి ప్రతి ఏటా ఒక నినాదంతో ఆహార ప్రాధాన్యతను తెలియజేస్తూ వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. అందరికీ పోషకాహారం



కల్పించడం, ఆహార ఉత్పత్తులు పెంచి ప్రస్తుత, భావి తరాల కోసం ఆహా భద్రతను కల్పించడానికి ఎఫ్ఏఒ కృషి చేస్తోంది. 2030 నాటికి ప్రపంచాన్ని ఆకలి నుంచి విముక్తి చేయడమే లక్ష్యంగా ఈ సంస్థ పని చేస్తున్నది. ఆరోగ్యమే మహా భాగ్యం కాబట్టి ప్రజలందరికి పౌష్టికామారం లభిస్తేనే వారు ఆరోగ్యంగా ఉంటారు. అందుకే దేశ భవిష్యత్తు ప్రజలకు అందే పౌష్టికాహార లభ్యత పైనే ఆధారపడి ఉంటుందనే విషయాన్ని ప్రభుత్వాలు విస్మరించకూడదు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలుపరచాలి.
మన దేశంలో ప్రజలందరికీ పౌష్టిక ఆహారం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2013లో జాతీయ ఆహార భద్రత చట్టాన్ని తీసుకువచ్చింది. "జాతీయ ఆహార భద్రత చట్టం 2013" అనేది జనాభాలో మూడింట రెండు వందల మందికి సబ్సిడీతో కూడిన ఆహార ధాన్యాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 12 సెప్టెంబరు 2013న చట్టం అయింది. ప్రజా పంపిణిలో పారదర్శకత, జవాబుదారీతనం కొరకు సోషల్ ఆడిట్, విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. అర్హులకు ఆహార ధాన్యాలను సరఫరా చేయలేని పరిస్థితిలో అర్హులైన లబ్ధిదారులకు ఆహార భద్రత భత్యం ఇవ్వాలి. పోషకాహార లోపం ఉన్న పిల్లలకు అధిక పోషకాహార పదార్థాలను ఐసిడిఎస్ ద్వారా అందజేయడం జరుగుతుంది.
తెలంగాణలో రేషన్ కార్డుదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా, గర్భిణీలకు, పాలిచ్చే తల్లులకు చిన్న పిల్లలకు.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆహార ధాన్యాలను అందజేస్తున్నారు. డెలివరీ అయినా మహిళలకు కేసీఆర్ కిట్ అందజేయడం జరుగుతుంది. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయడం, గురుకులాల్లో ఉన్న విద్యార్థులకు కూడా సన్నబియ్యంతో కూడిన ప్రొటీన్, విటమిన్లతో కూడిన పౌష్టికాహారం అందజేస్తున్నారు. సబ్సిడీ పైన రేషన్‌సరుకులు అందజేయడం జరుగుతుంది. పేదలందరికీ ఆహారం అందజేయాలనే ఉద్దేశంతో రూపాయికే కిలో బియ్యం పథకం అమలు చేస్తున్నారు. ఒక వ్యక్తికి నెలకు 5 కిలోల ఆహార ధాన్యాలను అందజేస్తున్నారు.
భారతదేశంలో సుమారు 40 శాతం పిల్లలకు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఆహార భద్రత సూచిలో 113 ప్రధాన దేశాల్లో భారతదేశం 71 స్థానంలో ఉంది. దీనిని మెరుగు పరచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆహార భద్రత చట్టం ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చడం, వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడం, వారి పిల్లలకు పోషకాహారం అందించడం.. వంటి అంశాలను సులభతరం చేస్తుంది. ఆహార భద్రత అనేది ప్రజలకు ముఖ్యంగా ప్రాథమిక పోషకాహారం లేనివారికి తగినంత ఆహార ధాన్యాల సరఫరాను నిర్ధారించడాన్ని సూచిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రొటీన్‌లు అధికంగా ఉండే ఆహార ఉత్పత్తులు తయారు చేయడంపై భారతదేశం దృష్టి పెట్టి తద్వారా దారిద్ర్య రేఖకు దిగువ ఉన్నవారికి తగిన పౌష్టికాహారం అందజేయాలి.

**- కందుకూరి భాస్కర్**

కథ

# త్రినేత్రా

శ్రిష్టి శేషగిరి

"ఈ ఏడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీలో బెస్ట్ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నాడు త్రినేత్ర. అతడు మన భారతీయుడు. అందునా మన తెలుగువాడు మన అదృష్టం" అంటూ వార్తలో ఉత్సాహంగా చెప్పుకుపోతుంది యాంకర్.

కెమెరాలన్నీ ఒక్కసారిగా త్రినేత్ర వైపుకు తిరిగాయి.

దేశంలో అన్ని టీవీ ఛానల్స్, పత్రికల్లో ఇపుడు అతనో సెలబ్రిటీ. అతని ఇంటిముందు విలేకరులు మైకులు, కెమెరాలతో ఆశగా ఎదురు చూస్తున్నారు. త్రినేత్ర బయటకు రాగానే ఒక్కసారిగా కెమెరాలు మైకులు అతన్ని చుట్టుముట్టాయి.

"సార్! దీనికి మీ స్పందన ఏంటి? మీరెలా ఫీల్ అవుతున్నారు?" వంటి రొటీన్ ప్రశ్నలు వేసి అతన్ని విసిగిస్తున్నారు.

త్రినేత్ర వాళ్ల ప్రశ్నలకు ఓపికగా సమాధానమిస్తున్నాడు.

దాదాపు గంటన్నర తరువాత ఇక చివరి ప్రశ్న..

"సార్, మీరు ఒక సాధారణ ఫొటోగ్రాఫర్ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి ఎలా ఎదిగారు? దీని వెనుక మీ కృషి ఎంత? అసలు మీరు ఫొటోగ్రాఫర్ ఎందుకు అవ్వాలనుకున్నారు? దానికి కారణం సందర్భం ఏంటి?" అని ప్రశ్నించాడు విలేకరి.

అసలు ఇదే చాలా ముఖ్యమైన.. అన్నిటికన్నా ముందర అడగవలసిన ప్రశ్న. నాకు ఎంతో ఇష్టమైన ప్రశ్న. ఎప్పటినుంచో నా మనసులో జవాబు దాచుకున్న ప్రశ్న" అంటూ త్రినేత్ర ఉత్సాహంగా చెప్పనారంభించాడు...

"అది.. అప్పుడప్పుడే నాకు ఊహ తెలుస్తున్న వయసు. పది పదిహేనేళ్ల లోపు వయసు ఉంటుంది నాకు. నేను పుట్టింది ప్రకృతికి అద్దం పట్టే పచ్చదనానికి ప్రాణం పోసిన ఒక చిన్న పల్లెటూరు.


మా నాన్న ఒక చిన్న రైతు. మాకున్న రెండెకరాలాలో నాన్న ఎంతో కష్టపడి బతుకుబండిని నెట్టుకొచ్చేవాడు.

నేను రోజూ నాన్నతో పాటు పొద్దున్నే లేచి లేలేత ప్రకృతిని ఆస్వాదిస్తూ పొలంలోకి వెళ్తుండేవాడిని. ఆ పచ్చదనం లేత ఉదయభానుడి కిరణాలు, ఆకులపై తుషార బిందువులు, కొమ్మలపై వాలే రకరకాల పక్షుల గుంపులు, విచ్చుకున్న పూబంతులు.. ఇవన్నీ నిత్యం చూస్తూ ఆనందిస్తూ పెరిగాను నేను.

అలా బాల్యం నుండే అందమైన సుందరమైన ప్రకృతిని నా కెమెరా లాంటి కనులలో అప్రయత్నంగానే బంధించుకోసాగాను.

నెమ్మది నెమ్మదిగా నా మనసులో నిద్రిస్తున్న ఒక అజ్ఞాత ఫొటోగ్రాఫర్ మేల్కొన్నాడు. బహుశా అప్పుడే నాలో ఆ కళ పట్ల ఆసక్తి పెరిగిందని చెప్పవచ్చేమో.

నాకు ఫొటోగ్రాఫర్ కావాలనే బలమైన కాంక్ష మనసులో ఉద్భవించి



నన్ను ఆ దిశగా అడుగులు వేసేలా చేసింది.

బీజం పడింది కానీ దాన్ని పండించు కోవడం ఎలా? ఎవరిని అడగాలి? అనుకుంటూ నాన్నను అడిగి వెయ్యి రూపాయలతో ఒక కెమెరా కొని, కనిపించిన ప్రతి దృశ్యాన్ని ఆ కెమెరాలో బంధించి ఆనందించసాగాను.

ఆ రోజుల్లో నేను తీసిన ఫొటోలను ప్రింట్స్ వేసి, ఊరివారందరికీ చూపించే వాడిని. అవి చూసి వారు నన్ను ఎంత గానో అభినందించేవారు. వారి ఇండ్లలో జరిగే చిన్న చిన్న ఫంక్షన్స్‌కి నన్ను ఫొటోలు తీసేందుకు పిలిచేవారు.

అది చూసి మా అమ్మా నాన్న కూడా ఎంతో ఆనందించేవారు. "మీ వాడిని వెంటనే పట్నం పంపు సుబ్బాయ. అక్కడ ఫొటోగ్రఫీలో పెద్ద కోర్సులు చేసి మరింతగా రాణిస్తాడు" అని మా బడి పంతులుగారు నాన్నకు సలహా ఇచ్చాడు.

నాన్న ఏ ధోరణిలో ఉన్నాడో కానీ వెంటనే పంతులుగారి మాటలకు 'సరే' అన్నాడు. తాను ఎప్పటినుండో దాచుకున్న కొంత పైకాన్ని తీసి నా చేతిలో పెట్టి నన్ను సంతోషంగా పట్నం సాగనంపాడు.

పట్నంలో మా దూరపు బంధువు నన్ను అక్కున చేర్చుకుని నన్ను ఆర్ట్స్ కాలేజీలో చేర్పించాడు.

పట్నంలో నేను కొత్తలో అందరిలానే ఇబ్బందులు పడ్డాను. నేను పుట్టి పెరిగిన ప్రశాంత పల్లె వాతావరణం వేరు, ఇక్కడ ఉరుకుల పరుగుల నగరం వేరు. ఆ పచ్చదనం, ఆ ప్రకృతి, ఆ మనుషులు ఇక్కడ కానరాలేదు. అయినా నన్ను నేను నిరుత్సాహపరుచుకోకుండా అనుక్షణం మనసును నా లక్ష్యం పైనే ఉంచాను.

పట్నంలో అంతా వింతగా కొత్తగా అనిపించింది. కళ్లెత్తి పలకరించేవారు లేరు. పల్లెత్తి మాట్లాడేవారు కానరాలేదు.

అంతా శూన్యం. ఒంటరితనం. ఏదో పోగొట్టుకున్న భావన. అలా కాలేజీ రోజులని కొంతకాలం భారంగా గడిపాను.

నాకు ఇష్టమైన ఫొటోగ్రఫీ కోర్సులో మరింతగా మనసు పెట్టి చదవసాగాను.

నా ఉత్సాహం చూసి నన్ను మరింతగా ప్రోత్సహించారు మా లెక్చరర్.

"నీలో మంచి కళ ఉంది త్రినేత్రా. దాన్ని ఇంకా ఇంకా సాన పెట్టు. ఎన్నడైనా నువ్వో గొప్ప ఫొటోగ్రాఫరువు అవుతావు" అని ఆయన ఇనందు మనసుతో ఆశీర్వదించారు.

ఐదేళ్ల కాలం ఐదు నిమిషాల్లా కరిగిపోయింది చూస్తుండగానే.

కోర్సు పూర్తవగానే ఉద్యోగ వేటలో పడ్డాను.. హైదరాబాద్ నగరం అప్పుడప్పుడే అభివృద్ధి చెందడం మొదలైంది. ఇంకా అటు పూర్తిగా ఆధునికం కాదు. మరీ అంత వెనుకబాటు లేదు.. అన్న చందంగా ఉండేది ఆనాటి నగర పరిస్థితి.

నాకేమో నాన్నను డబ్బు అడగాలంటే మొహమాటం. అప్పటికే ఆయన తన శక్తికి మించి నన్ను చదివించాడు. ఇక అన్నయ్యను అడగాలంటే నాకే సిగ్గేసింది. అపుడు ఒక మిత్రుడు ఓ అద్భుతమైన సలహా ఇచ్చాడు-

"త్రినేత్రా! నీలో మంచి టాలెంటు ఉంది. దాన్ని చక్కగా ఉపయోగించుకో, నాలుగు డబ్బులు కూడబెట్టు" అని అన్నాడు.

అతని మాట విని వెంటనే ఓ సెకండ్ హ్యాండ్ కెమెరా కొన్నాను.

పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు, చిన్నా-పెద్దా శుభకార్యాలకు ఫొటోలు తీయనారంభిం చాను. ఆర్థికంగా కొంత వెసులుబాటు లభించింది. ఉన్నంతలో ఇంటికి కొంత డబ్బు పంపసాగాను. కొడుకు పంపిన డబ్బులు చూసి అందరి తల్లిదండ్రుల్లాగే నా తల్లిదండ్రులు కూడా తెగ సంబరపడ్డారు. ఊరందరికీ నా గురించి గొప్పగా చెప్పసాగారు.

అప్పుడే నాకు ఓ ప్రముఖ పత్రికలో ఫొటోగ్రాఫర్‌గా ఉద్యోగం వచ్చింది. మరోపక్క నాకు వ్యక్తిగతంగా మంచి ఫొటోగ్రాఫర్‌గా గుర్తింపు రావడం మొదలైంది.

ఒక పక్క ఉద్యోగం, మరోపక్క తీరిక వేళల్లో ప్రైవేటుగా ఫొటోలు తీయసాగాను. చేతినిండా తీరిక లేని పని. క్షణం తీరిక లేదు. ఆదాయానికి లోటు లేదు.

ఫొటోగ్రాఫర్‌గా సంపాదించిన డబ్బుతో మొదటిసారి కారు కొన్నాను. ఇద్దరు కుర్రాళ్లకు శిక్షణనిచ్చి పనిలో పెట్టుకున్నాను. చిన్నప్పటి నుండి ఆసక్తి ఉన్న రంగం కావడం వల్ల చేసే పనిలో పూర్తిగా నిమగ్నం అయిపోయేవాడిని. పనిలో పడితే తిండి తిప్పలు తెలిసేవి కావు.

ఈ క్రమంలో ఓ పెద్ద స్టూడియో ప్రారంభించాను. నా అభిరుచికి తగ్గట్టుగా దాన్ని తీర్చిదిద్దాను. ఆసక్తి గల ఎందరో యువకులకు శిక్షణతో కూడిన ఉపాధిని అందించాను.

ఫొటోలు, వీడియోలు అద్భుతంగా తీయడంతో పాటు తక్కువ ధర, టైంకి అందించడంతో జనాలు నా పైన, స్టూడియో పైన విపరీతమైన అభిమానం, నమ్మకం కనబరిచారు. నన్ను ఆదరించారు.

అలా నా పేరు క్రమంగా స్థానిక పత్రి కల్లో రావడం మొదలయింది. దాంతో నా స్టూడియోకి సినిమా, రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు తమ వ్యక్తిగత అవసరా లకు, వారి ఇళ్లల్లో జరిగే అన్ని శుభకార్యా లకు నాకే అవకాశమిచ్చేవారు. చూస్తుండ గానే నేను ఒక గొప్ప ఫొటోగ్రాఫర్‌గా ఎదగసాగాను. ఉండటానికి ఒక సొంత ఇల్లు కొని అమ్మా నాన్నల కోరిక నెరవేర్చాను.

రోజూ హత్యలు, శవాలు, దారుణాలు, ఘోర యాక్సిడెంట్లు వంటివి చూసీ చూసీ మూడో కన్ను నీరుగారింది. మరోపక్క మా ఊళ్లో తీవ్ర కరువు. పచ్చని పొలాలన్నీ బీడుపడ్డాయి. ఎండిన చెట్లు చెట్లు చేమలు, వాగులు వంకలు మా ఊరి రూపురేఖల్ని సర్వనా శనం చేసాయి. ఆ ప్రకృతి లేదు, ఆ పక్షులు లేవు. ఎక్కడ చూసినా భయంకరమైన కరువు.

వెంటనే నాలోని కెమెరామెన్ నిద్రలే చాడు. కెమెరాకు కళ్లు మాత్రమే ఉండాలి. కానీ నోరు, చెవులతో పనిలేదు అని గ్రహించి నాలో ఆవేదనని కెమెరాలో కళ్లకు కట్టినట్లు చిత్రీకరించాను. వాటిని జాతీయ, అంతర్జాతీయ పత్రికలకు పంపాను. వాటికి అద్భుతమైన స్పందన లభించింది.

ఇక దాంతో వెనుతిరిగి చూసుకోలేదు. కెమెరాను వెంటబెట్టుకొని ఎన్నో ప్రాంతాల్లో పర్యటించాను. కెమెరా కన్నులతో ఎన్నో దేశాలను సందర్శించాను. నాలోని కళను పరిపుష్టం కావించాలనే తపనతో ప్రాణాలను లెక్కచేయకుండా పర్యటించాను.

యుద్ధాలను, ప్రకృతి విలయాలను, లోయలను, ఎత్తులను, ఆకులను, అడవులను, సముద్రాలను, కొండలను అందులోని అద్భుతాల్ని కెమెరాలో బంధించాను. వాటిని ఎన్నో అంతర్జాతీయ పత్రికలకు పంపాను. నాలోని కళకు నిరంతరం పదును పెట్టుకుంటూ ముందుకు పోయాను.

ఆ సమయంలో నాకు జరిగిన ఒకరి పరిచయం జీవితాన్ని మలుపు తిప్పింది. ఆమె పేరు కల్పన. ఆమెకు కూడా నాలాగే ఫొటోగ్రఫీ అంటే ఎంతో మక్కువ అని మాటల్లో తెలిపింది. ఆమెకు కొంత శిక్షణ ఇచ్చి ఆమెలోని ఆసక్తిని పెంపొందించాను. అలా మా ఇద్దరి అభిప్రాయాలతో పాటు మనసులూ కలిసాయి. అవి వివాహానికి దారితీసాయి.

నాకు ఓ ప్రముఖ పత్రికలో ఫొటోగ్రాఫర్‌గా ఉద్యోగం వచ్చింది. మరోపక్క నాకు వ్యక్తిగతంగా మంచి ఫొటోగ్రాఫర్‌గా గుర్తింపు రావడం మొదలైంది.

కాలం వేగంగా పయనించింది. మాకొక బాబు. వయసు మూడేళ్లు. నేను నా కళను మరింతగా పెంపొందించుకుంటూ నగరంలో పెద్ద స్టూడియో నెలకొల్పాను. ఎందరో ఔత్సాహికులకు మెరుగైన శిక్షణ అందించసాగాను.

చూస్తుండగానే కాలం వంద మైళ్ల వేగంతో ప్రవహించసాగింది. కాలంతో పాటే నా వయసు కూడా పరిగెత్తుతూ నన్ను అరవయ్యో వసంతంలోకి తీసుకెళ్లింది.

వయసు దేహానికిగానీ కళకు కాదు అనేది నేను నమ్మే గొప్ప సిద్ధాంతం. వయసును లెక్కపెట్టకుండా నాలోని కళకు నిత్యం వన్నెలు అద్దుకుంటూ ఇంకా ఇంకా మెరుగులు దిద్దుకుంటూ నన్ను నేను ముందుకు నడిపించుపోతున్నాను.

ఆ క్రమంలోనా ప్రతిభకు నాలోని నిబద్ధ తకు మెచ్చుకోలుగా ఎన్నో జాతీయ అవా ర్డులు, రివార్డులు, బిరుదులు, సన్మానాలు నన్ను వెతుక్కుని వచ్చి వరించాయి.

చూస్తుండగానే జీవితం చరమాంకంలోకి నా ప్రమేయం లేకుండానే ప్రవేశించింది. నాకిప్పుడు డెబ్బై అయిదు సంవత్సరాలు. అరవై వసంతాలకు పైగా కెమెరాతో నాకు అనుబంధం. మా ఈ అనుబంధాన్ని విడదీయడం ఎవరివల్ల కాదేమో ఈ జన్మకి. ఇంకా నాలో ఏదో తృష్ణ, ఏదో కొత్తగా సాధించాలని తపన. నా కళ్లు మసకబారినా ఇంకా మెరిసే ఆ కెమెరా కళ్లతో వినూ త్నంగా చూపాలనే మనసులో ఆశ. ఆ ఆశతోనే నాలో ఉన్న కళాకారుడు ఇంకా జీవిస్తున్నాడు. దేవుడిచ్చిన గొప్ప కళకి కృతజ్ఞతగా దాన్ని ఆదరించిన ఈ సమాజా నికి నిండు మనసుతో కృతజ్ఞతలు తెలియ చేసుకుంటున్నాను. పట్టుదలతో శ్రమిస్తే ఏ కళ అయినా నెరవేరుతుంది.

కల సాధికారం చేసుకునే తరుణంలో ఎన్నో ఆటంకాలు, అడ్డంకులు వస్తాయి. అవి ఎవరికైనా తప్పవు. కానీ మనం వాటికి తల వంచకుండా తపనతో, పట్టుదలతో దూసుకుపోవాలి.

అప్పుడే ఏ రంగంలో అయినా ఉన్నత శిఖరాలను అధిరోహించ గలం. ఇదే నేటి యువతకు నేనిచ్చే సలహా, సందేశం" అంటూ ముగించాడు త్రినేత్ర. ❑



# ఇనుప పాత్రలకు పూర్వ వైభవం

**పూర్వ** కాలంలో ఇనుప పెనం మీదే అట్లు పోసేవారు. కూర వేయించాలంటే ఇనప బాండ్లీలోనే వండేది బామ్మ. మెల్లగా వాటి స్థానంలో కాపర్ బాటమ్ స్టీల్ అనీ, నాన్‌స్టిక్, సెరిమిక్ కోటెడ్ వచ్చాయి. ఇప్పుడు వాటి స్థానంలో కిచెన్‌లోకి కాస్ట్ ఐరన్ కుక్‌వేర్ కాస్త నునుపుదేలి మళ్లీ అడుగు పెడుతోంది. వేల సంవత్సరాల క్రితం మనిషి తవ్వి తీసిన ఖనిజమే ఇనుము. పనిముట్లకీ, ఆయుధాల తయారీకి అన్నింటికీ అదే ఆధారం. ఆ తరువాత దాంతో వంటపాత్రల్నీ తయారుచేశాడు. ఆపై నాగరికత నేర్చిన మనిషి దానికి కార్బన్, మాంగనీస్, సిలికాన్, ఫాస్ఫరస్, సల్ఫర్, ఆక్సిజన్ వంటి ఇతర పదార్థాలను జోడించి పుట్టించిన గట్టి పదార్థమే స్టీలు. స్టీలుపాత్రలు అన్ని విధాలా మంచివే. కానీ నేరుగా స్టవ్ మీద పెట్టలేం. అందుకే నాన్‌స్టిక కోటెడ్ పుట్టుకొచ్చాయి. అయితే వీటికి పూసే టెఫ్లాన్ కోట్ రసాయన పూరితం కావడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.



**ఎందుకు మంచిది?**

మనమేం తింటున్నాం అన్నదాంతో పాటు ఎందులో వండుతున్నాం? అన్నదీ ముఖ్యమే. ఇనుప పాత్రల్లో వండటం వల్ల ఆయా వంటకాలు రుచిగా ఉంటాయి. పైగా అవి బాణలికి అంటుకున్నా భయపడక్కర్లేదు. కొద్దిపాళ్లల్లో ఇనుమురేణువులు కరిగి ఆహారంతో పాటు లోపలకు వెళ్తే, రక్తహీనత సమస్య ఉండదు, వైద్యులూ ఇనుప పాత్రల్లోనే వండుకోమని సూచిస్తున్నారు. పైగా ఇనుప పెనాలు వాడేకొద్దీ నునుపుదేలి నాన్‌స్టిక్‌లా పనిచేస్తాయి. కాబట్టి స్టెయిన్‌లెస్ స్టీలు, అల్యూమిని యంతో చేసిన వాటితో పోల్చితే ఇనుప బాండ్లీల్లోనే నూనె తక్కువ పడుతుంది. ఇనుప పాత్రల్లో ముడి ఇనుముతో చేసినవీ, కాస్ట్ ఐరన్‌తో చేసినవీ అని రెండు రకాలు. అంటే ముడి ఇనుముని నేరుగా వేడి చేసిన పనిముట్ల సాయంతోనే పాత్రలు చేస్తారు. కనుక ఇవి వాడేకొద్దీ నునుపు దేలతాయి. కాస్ట్ ఐరన్ పాత్రల కోసం ఇనుమును కరిగించి, అందులో రెండు నుంచి ఐదు శాతం కార్బన్, కొద్ది పాళ్లలో సిలికాన్, మాంగనీస్, సల్ఫర్, ఫాస్ఫరస్ వంటి వాటినీ కలిపి నమూనాల్లో పోసి చల్లార్చి పాత్రలు తయారు చేస్తారు. అందుకే ముడి ఇనుప పాత్రలకన్నా కాస్ట్ ఐరన్‌వి దృఢంగా, నున్నగా ఉంటాయి. అయితే ఇవి వేడెక్కడానికి కాస్త ఎక్కువ సమయం పడుతుంది. అదే సమయంలో త్వరగా చల్లారవు కూడా. అచ్చంగా ఐరన్‌తో చేసినవి కాస్త పలుచగా ఉండ టంతో త్వరగా వేడెక్కి అంతే త్వరగా వేడి తగ్గిపోతాయి. కానీ కాస్ట్ ఐరన్‌తో పోలిస్తే ముడి ఇనుప పాత్రల్లో వండిన వాటి ల్లోనే ఐరన్ కలిసే అవకాశం ఎక్కువ. ఆధునిక కిచెన్‌కి కాస్ట్ ఐరన్‌తో చేసినవైతే చూడ్డానికి బాగుంటాయి. మొత్తంమీద ఈ రెండు రకాల ఇనుప పాత్రలూ నాన్‌స్టిక్‌తో పోల్చితే ఆరోగ్యానికి మంచివే. వీటిల్లో వండినవి తినేవా ళ్లలో ఐరన్‌లోపం తగ్గుతున్నట్లు కొన్ని అధ్యయ నాల్లోనూ తేలింది. అయితే ఉడికించే సమయం, వండే పదార్థాన్ని బట్టి ఐరన్ కలిసే శాతం ఆధారపడి ఉంటుందట. ఉదా: కూరగాయలతో పోలిస్తే మాంసాహారాన్ని వండినప్పుడు ఐరన్ శోషణ ఎక్కువ. అందుకే ఇప్పుడు మన దగ్గరనే కాదు, విదేశాల్లోనూ అనేక కంపెనీలు ఐరన్, కాస్ట్ ఐరన్ కుక్‌వేర్ పేరుతో పెనాలు, కూరగాయలు ఉడికించుకునే పాత్రలూ, గ్రిల్ పాన్‌లు, పొంగనాల ప్లేటూ.. ఇలా రకరకాల వంట పాత్రలను తయారుచేస్తే ఆన్‌లైన్‌లోనూ లభిస్తున్నాయి. ■



# 'ఎగిరే జెండా కాదు.. ఆడించే దండా చూడు' ప్రజాకవి కాళోజీ

**1914 సెప్టెంబరు 9 రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావు రామ్‌రాజా కాళోజీ జన్మదినం. ప్రజాకవి కాళోజీ జన్మదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించింది.**

సాహిత్యం

తరతరాల అణచివేత, రాజ్యాధిపత్య అహంకార పాలనా దుస్థితిలో కుంగి కృశించిన తెలంగాణలో భాషను బతికించుకోవటమే నాడు ఉద్యమమైంది. హైదరాబాద్ సంస్థాన అధికార భాషగా ఉర్దూ ఆధిపత్యం, మరాఠీ, కన్నడ, పార్శీ, హిందీ, సంస్కృతం వంటి భాషల ప్రభావం కారణంగా తెలంగాణ సాహితీవేత్తలు తొలి తరం బహు భాషా ప్రావీణ్యులుగా కాలమాన పరిస్థితులను తమ రచనలలో ప్రతిబింబింపచేసారు. వ్యావహారిక, గ్రాంథిక భాషావాదాన్ని అంతగా పట్టించుకోవలసిన అగత్యం లేకుండా స్థానిక భాషా పరిమళాలను కలిపి తమ రచనలలో ఆధునిక సాహిత్యంగా ప్రతిఫలింప చేసారు. నిరంతర సమరశీల చైతన్యంతో తిరుగుబాటు తత్వాన్ని అచ్చతెలుగు పలుకుబడితో, జన సామాన్యపు నాల్కలపై నాట్యమాడించారు.

ప్రాచీన కవులు కావ్య భాషా ప్రయోగాలు, పురాణ శతక, అలంకార, పద్య ప్రక్రియలు, భౌగోళిక, చారిత్రక దశలు, ఆర్థిక సాంఘిక రాజకీయ పరిణామాలు సాహితీ ఆత్మ ప్రతిఫలించి తెలుగు ఆరాధ్యనీయం అయింది.

ఆంగ్ల భాషా వ్యామోహాన్ని తీవ్రంగా నిరసించిన ధోరణిలో కాళోజీ "అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా" అంటూ చురకలు అంటించాడు.

"నీ భాషల్నే నీ బతుకున్నది. నీ యాసల్నే నీ సంస్కృతున్నది. ఎవని యాసలు, ఎవని భాషలు వాడు రాయాలె" అంటూ ఆంధ్ర ప్రామాణిక భాషను రెండున్నర జిల్లాల భాషగా నిరసించారు. తెలంగాణ తెలుగు మాండలిక, నుడికారపు జీవ స్థానీయ స్పృహతో కొరడా ఝుళిపించారు.



కాళోజీ మొట్టమొదటి కవితా సంకలనం 'నా గొడవ' శీర్షికతో 1938లో తొలిగా వెలువడింది. ఆ తర్వాత వచ్చిన సంకలనాలన్నీ ఇదే శీర్షికతో వచ్చాయి. ఆర్య సమాజం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, విశాలాంధ్ర, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తెలంగాణ సమకాలీన రాజకీయ, సామాజిక వివిధ పరిణామ దశలలో 1942 నుండి ప్రారంభమైన ఆయన జనజీవన చైతన్య యాత్ర ప్రజా హృదయాలను కదిలించింది.

1953 జనవరి 12న కాళోజీ రాచరిక పాలన, రజాకార్ల పైశాచిక కృత్యాలపై రాసిన గేయాల సంకలనాన్ని అలంపురంలో ఆవిష్కరిస్తూ శ్రీశ్రీ ఇలా అన్నారు "కాళోజీ నిఖిలాంధ్ర కవి. అందులో ఎట్టి సందేహం లేదు. ఆయనకు తెలంగాణ అంచులు, గోడలుగా అడ్డు నిలువజాలవు. ఆయన తన ఖండ కావ్య సంపుటి 'నా గొడవ' విశాల జగత్తు ప్రజల అందరి గొడవ. కాళోజీ లూయీ అరగాన్ లాంటివాడు. ఫ్రాన్స్ అంతర్యుద్ధంలో కవులంతా చెల్లాచెదురుగా పారిపోతే 'అరగాన్' ఒక్కడే నిలబడి మహా ప్రజా నిర్భయ విశ్వాసంతో గీతాలు రాసాడు. అదే విధంగా తెలంగాణ మూగజీవుల హృదయాలను కాళోజీ ప్రతిబింబింపచేసారు".

"అసమ సమాజంలో ఆర్జనయే అసలు దౌర్జన్యం" అన్న కాళోజీ–

"అన్నపు రాశులు ఒకచోట
ఆకలిమంటలు ఒక చోట
సంపదలన్నీ ఒక చోట
మాసిన తలలింకొక చోట"

అంటూ కష్టాలకు, కడగండ్లకు గురి అవుతున్న నిరుపేదల పక్షాన ధిక్కార స్వరం వినిపించారు.

"దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకొని
దొరలై వెలిగేదెన్నాళ్ళు?" అంటూ
ప్రజలను పీడించే పాలకులను నిలదీసారు.

1948లో తాను గుల్బర్గా జైల్లో ఉన్నప్పుడు రజాకార్ల నిస్సహాయ అమాయక మూకుమ్మడి అత్యాచార పాశవికతను తీవ్రంగా ఖండిస్తూ–

"కొంగు లాగిన వ్రేళ్ల కొలిమిలో పెట్టాలె
కన్ను గీటిన కళ్లకారాలు చల్లాలె
తన్నిన కాళ్లను 'డాకలి'గా వాడాలె
కండ కండగా కోసి కాకులకు
వెయ్యాలి".

తన ఎనభై ఎనిమిది వసంతాల జీవితంలో చూసిన పరిణామాలను–

"జరిగినదంతా చూస్తూ
ఎరగనట్లు పడి వుండగ
సాక్షీభూతున్నిగాను
సాక్షాత్తు మానవున్ని" అన్నారు.

జన సామాన్య వ్యవహారిక భాషను, తెలంగాణ యాసను గుండెల్లో పెట్టుకొని ప్రేమించిన కవిగా "రెండున్నర జిల్లాలదే దండిభాష అయినప్పుడు / తక్కినోళ్ళ యాస / తొక్కి నొక్కబడ్డప్పుడు ప్రత్యేకంగా రాజ్యంపాలు / కోరడం తప్పదు" అని కాళోజీ ప్రకటించారు.

కవితలు, కథలు 1934 నుంచి మొత్తం 21 పుస్తకాలు రచించారు. వ్యంగ్యాత్మక హాస్యం, చమత్కార విమర్శ, ఆర్ద్ర సున్నిత హృదయ కవిగా కాళోజీ పద్మవిభూషణ్‌గా ఎన్నో అవార్డులు, సత్కార పురస్కారాల అభినందనలు పొందారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సారథ్యంలో "వీర తెలంగాణ నాది వేరు తెలంగాణ నాది

వేర్వైన కూడా తెలంగాణ వీర తెలంగాణ ముమ్మాటికి" అంటూ..

"ప్రాంతంవాడే దోపిడి చేస్తే
ప్రాణంతోనే పాతర వేస్తాం" అన్నారు.

2002 నవంబరు 13న తుది శ్వాస విడిచిన 'కాళోజీ' జీవితం, సాహిత్యం ఒక్కటిగా అతి సామాన్య మాన్య అసామాన్య అక్షర తపస్విగా జీవించారు.

**– జయసూర్య**

సింగిల్ పేజీ కథ

# వడ్లగింజలో బియ్యపు గింజ

సత్యవాణి

**"ఒరేయ్ అబ్బాయ్! నేను రేపు ఉదయాన్నే మన ఊరెళ్లదలచుకొన్నాను" అన్నారు ఆనందరావుగారు. ఉరమని పిడుగు లాంటి తండ్రి మాటకు అదిరిపడ్డాడు శ్రీనివాస్.**

"ఏం జరిగిందంటూ" కళ్లతోనే లతను ప్రశ్నించాడు అతడు.

"ఏమో!" అన్నట్లు లత భుజాలు కదిపింది.

"వినపడిందా? నేను ఉదయాన్నే బయలుదేరతాను. మీరు అప్పటికి లేవరని ఇప్పుడే చెపుతున్నాను" ఇక చెప్పవలసింది లేదన్నట్లు అక్కడి నుండి లేచి గదిలోకెళ్లిపోయిన తండ్రి వంక అయోమయంగా చూసాడు శ్రీనివాస్.

రాత్రి గదిలోకి రాగానే "మన వల్ల ఏదైనా తప్పు జరిగిందంటావా? నువ్వు పొరపాటుగా ఏమైనా అన్నావా?" అని భార్యను ప్రశ్నించాడు శ్రీనివాస్.

"నేనేమంటానండీ ఆయనను. అయినా ఆయన అనిపించుకొనేలాంటి మనిషా! ఎవరికీ ఏమాత్రం బాధ కలిగించకుండా చక్కగా ప్రవర్తిస్తారు. చేతనైన సాయం చేస్తారు. ఆయన వచ్చిన ఈ పది రోజుల నుండీ నా ప్రాణానికి సుఖంగా ఉంది. తెల్లారి పాలు తేవడం, తెల్లారకుండా వచ్చే పంపునీళ్లు పట్టడం, బాబిగాడిని స్కూలుకి తీసికెళ్లడం, స్కూలు నుండి తీసుకురావడం, ముఖ్యంగా నేను ఆఫీసు నుండి వచ్చేలోపు ముందుగా వచ్చే బాబిగాడు ఏం పెత్తనాలు చేస్తున్నాడో అనే బెంగ ఆయన వచ్చాక లేకుండా హాయిగా ఉంది".

మామగారిచ్చే కో-ఆపరేషన్ ఏకరువు పెట్టింది లత.

మామగారు వెళ్లిపోతే కలిగే బాధ తనకే ఎక్కువ అన్నట్లుంది, ఆమె మాటల్లో.

"ఆయన గదికి వెళ్లి అసలు ఏం జరిగిందో కనుక్కోండి" అంది లత.

ఇక్కడ ఉండిపోవడానికే వచ్చానన్న మనిషి వారం రోజుల్లో తిరిగి వెళ్లిపోతానంటున్నారంటే ఏదో జరిగింది.

అమ్మ పోయాక రమ్మన్నా రానన్న మనిషి తనంత తానుగా ఉండిపోవడానికే వస్తున్నానంటే కొడుకు శ్రీనివాస్, కోడలు లతలు చాలా సంతోషించారు. ఆ పల్లెటూళ్లో లంకంత ఇంట్లో , పెద్ద వయసులో ఒక్కరూ వుంటున్నారన్న దిగులు పడేవారు భార్యాభర్తలు.

"వెళ్లండి.. వెళ్లి విషయం ఏమిటో కనుక్కోండి. తెల్లారాయన బయలుదేరాక ఆపటం బాగుండదు. ఆగమన్నా ఆయన ఆగరు కూడా" మామగారి గదిలోకి శ్రీనివాస్‌ని తరిమింది లత.

శ్రీనివాస్ తండ్రి మంచంపై కూర్చొని "ఏం నాన్నా! మీకు ఎందుకు కోపం వచ్చింది? నేనుగానీ, లతగానీ మీ మనసు బాధించామా? ఉండిపోయేలా వచ్చారని, ఇంట్లో పెద్ద దిక్కులా వుంటున్నారని సంతోషపడుతుంటే మీ ఈ నిర్ణయంతో నేనూ, లతా చాలా చాలా బాధ పడుతున్నాం. తప్పు జరిగితే చెప్పండి, దిద్దుకుంటాం ప్లీజ్" తండ్రి చేతులు పట్టుకుని అడిగాడు శ్రీనివాస్.



"మీరు తప్పు చేయడమేమిటిరా! మీ మొఖం.. నా కోడలు అస్సలు చెయ్యదు. ఇక నేను వెళ్లడానికి కారణం అంటావా? అమ్మ పోయాక ఒంటరినన్న దిగులు నన్ను వేధిస్తోంది. కానీ మీరు నన్ను ఎన్ని సార్లు రమ్మన్నా రాకపోవడానికి కారణం మీకు అడ్డమౌతానేమో అని తప్ప వేరే కారణం లేదు. నా ఒంటరితనం బాధను చూసిన స్నేహితులు, బంధువులు–

"ముత్యాల్లాంటి కొడుకు, కోడలు; రత్నాల్లాంటి మనవడిని పెట్టుకొని ఇక్కడ ఈ పల్లెటూళ్లో బాధ పడడం ఎందుకు? వెళ్లి మనవడితో హాయిగా కాలక్షేపం చెయ్యి" అని అడగకుండానే సలహాలిస్తుంటే బయలుదేరి వచ్చాను. కానీ ఇక్కడికి వచ్చినా ఉదయం రెండు గంటలు, సాయంత్రం పది నిమిషాలు తప్ప నేను చేసేదేమీ లేదు. మీకా ఆఫీసులు.. హడావిడి. బాబిగాడికా సాయంత్రం వచ్చినప్పటి నుండీ ట్యూషన్లు, ఆపై ఇంటికి వచ్చాక టీవీ తప్ప వేరే లోకం లేదు. వాడికి ఎన్నో కథలూ, కబుర్లూ చెపుదామనుకొంటే వాడితో మాటలే వుండటం లేదు. వాడికి ఆ టీవీ తప్ప తాతయ్య అక్కరలేదు" చిన్న పిల్లలా ఉక్రోషంగా మాట్లాడుతున్న తండ్రిని చూస్తే ఆయన బాధ అర్థమైంది శ్రీనివాస్‌కి.

"నాన్నా, మీ బాధ అర్థమైంది. రేపటి నుండి మీ మనవడు మీతో కాలక్షేపం చేస్తే చాలుగా! మీరు ఊరికి వెళతానని అనరుగా!" అడిగాడు, కొడుకు.

"అంతే.. అంతే!" అన్నట్లు తల వూపాడు ఆనందరావుగారు.

తండ్రి గదిలోంచి బయటకు వస్తూనే టీవీ కనెక్షన్ తీసేసి రిమోట్ అటక మీదకు విసిరేసి శ్రీనివాస్ హాయిగా నిద్ర పోతున్న కొడుకు బుగ్గపై ముద్దు పెట్టుకుంటున్న భర్తను చూస్తూ– "ఏమన్నారు మామగారు?" అని అడుగుతున్న భార్యకి–

"ఏమీ లేదోయ్! వడ్లగింజలో బియ్యపు గింజ" అన్న మాటలకు అయోమయంగా చూసింది లత.

"ఏమైతే నీకెందుకు? ఇక్కడి నుండి నాన్న ఇక వెళ్లరులే!" అన్న భర్త మాటలు ఆమె చెవులకు విందు చేశాయి.

"హమ్మయ్య!" అని హాయిగా నిట్టూర్చి నిద్రకు ఉపక్రమించింది లత. ❑

# యజమాని కూర్చోవటానికి అనువైన స్థలం?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




ఉత్తర ముఖ ద్వార దుకాణాలలో యజమాని కూర్చోవడానికి రెండు స్థానాలు శ్రేష్ఠమైనవి.

1) వాయువ్యం 2) నైరుతి.

వాయువ్య స్థానంలో కూర్చోవటానికి అనుకూలంగా వున్నప్పుడు వాయువ్య స్థానంలో ఉత్తరపు గోడను తగులకుండా పశ్చిమ వాయువ్యపు గోడను ఆనుకొని యజమాని కూర్చోవాలి. కింద కూర్చోవలసి వస్తే అరుగులు కట్టుకొని కూర్చోకూడదు. అరుగు కట్టడం వల్ల వాయువ్య మూల ఫ్లోరు, ఈశాన్యం కంటే ఎత్తు అవటం మంచిదేగానీ ఆగ్నేయం కంటే, నైరుతి కంటే కూడా ఎత్తు ఎక్కువవటం అయ్యే అవకాశముంది. అందువల్ల అరుగు లాంటిది కట్టకుండా కింద కూర్చోవాలి లేదా కుర్చీ, టేబులు వేసుకొని కూర్చోవచ్చు.




ఉత్తర ముఖ ద్వార దుకాణంలో ఉత్తరానికి అభిముఖంగా కూర్చుంటే మొఖం బజారు వైపుకి వుండి దుకాణంలో జరిగేది కనిపించే అవకాశం వుండదు. కనుక అటువంటి దుకాణంలో వాయువ్యంలో కూర్చోవలసి వచ్చిన దుకాణదారుడు సాధారణంగా తూర్పుకు అభిముఖంగా కూర్చోవటం జరుగుతుంది. తూర్పు, ఉత్తరాల వైపు కాకుండా మరోవైపు అంటే పశ్చిమ, దక్షిణ, దిక్కుల వైపు మొహం పెట్టి కూర్చోవటం సబబు కాదు.

వాయువ్యంలో తూర్పు దిశగా మొహం చేసి కూర్చున్నప్పుడు ఎదురుగా టేబిలు, కుడిచేతి వైపు గల్లాపెట్టెగానీ, డబ్బు నిలువ చేసే అలమారగానీ ఏర్పాటు చేసుకోవాలి.

దుకాణంలోకి నడిచివచ్చే కస్టమర్లకు ఉచ్చదిశగా ప్రవేశం ఏర్పాటు చేయటం చాలా అవసరం. ఉత్తర ముఖ ద్వారం వైపు ఈశాన్యం మూల నుండి వాయువ్య మూల వరకు వీధిలోకి మెట్లు కట్టవచ్చు లేదా ఉత్తర భాగం మొత్తం పొడవు ఎంత వుందో కొలిచి అందులో సగ భాగం ఈశాన్యం నుండి (కొలిచి) మెట్లు నిర్మాణం చేసుకోవాలి. ఇలా చేయడం వలన వాయువ్యంలో కూర్చునే యజమాని ముందు నుండే అంతా లోపలికి వెళ్లటం, బయటకు రావటం జరుగుతుంది. కస్టమర్ల నడక ఉత్తర ఈశాన్యం, ఉత్తరంలో ఉచ్ఛ స్థానాల ద్వారా జరుగుతుంది.

యజమాని తనకెదురుగా కనిపిస్తున్న తూర్పు ఈశాన్యంలోగానీ, తన వెనుక వున్న పశ్చిమ వాయువ్య భాగంలోగానీ గోడకు దేవుని పటాలు ఏర్పరచుకొని రోజూ పూజ చేయాలి.

తూర్పుకు అభిముఖంగా కూర్చుంటే కుడి చేతి వైపు గల్లాపెట్టె ఉత్తరాభిముఖంగా వుండాలి. అదే యజమాని ఉత్తరాభిముఖంగా కూర్చుంటే గల్లాపెట్టె ఎడమ చేతి వైపున తూర్పుకు అభిముఖంగా వుండాలి. ఈ స్థానంలో కింద కూర్చోకూడదు. అరుగు నిర్మించి దాని మీద కూర్చోవాలి. లేదా కుర్చీ టేబులు ఏర్పాటు చేసుకోవచ్చు.

పూజ విషయంలో ఈశాన్యమే ప్రధానం.

## షట్టర్స్

మొదట ఈశాన్యంలో వున్న 1) షట్టర్ తెరిచిన తర్వాత 2వ, 3వ షట్టర్స్ తెరవాలి. అలాగే దుకాణం కట్టేసేటప్పుడు మొదట వాయువ్యంలో వున్న షట్టర్ మూడవ మూసివేసి, తర్వాత రెండవ, ఆ తరువాత మొదటి షట్టర్ మూసివేయాలి.

ఉత్తరంలో షట్టర్స్ రెండుగానీ, అంతకు ఎక్కువగానీ వున్న దుకాణమయితే–

ఉదయం దుకాణం తెరిచేటప్పుడు మొదట ఈశాన్యం వైపున వున్న షట్టర్ తెరవాలి. తర్వాత మిగతావి తెరవాలి.

సాయంత్రం దుకాణం కట్టేసేటప్పుడు.. ముందు వాయువ్యం వైపున వున్న షట్టర్ మూసి ఆ తర్వాత చివరలో ఈశాన్యం వైపువున్న షట్టర్ మూయాలి.

దుకాణం పనివేళలలో షట్టర్స్ అన్నీ తెరచి పెట్టడం సాధారణంగా జరుగుతుంది.

ఒక్కోసారి ఎక్కువ స్థలం కోసం వరుసగా నాలుగయిదు 'మడిగెలు' తీసుకొని మధ్యనున్న అడ్డుగోలు తీసేసి ఒకే దుకాణం, హోటలు మొదలయినవి నడుపుతుంటారు.

అటువంటప్పుడు ఒకే దుకాణానికి, హోటలు మొదలయిన వాటికి నాలుగయిదు షట్టర్స్ ఉండడం సంభవిస్తుంది. ఆ షట్టర్స్ అన్నీ తెరిచిపెట్టకుండా దారి కోసం ఒక షట్టర్ తెరిచి మిగతావి మూసేసి 'గోడ'లా వాడుకుంటూ వుంటారు.

అలా షట్టర్స్ ఉత్తరానికి వుంటే ఈశాన్యం వైపున్న షట్టర్‌ని దారిగా ఉపయోగించి, మిగతావి మూసివేయవచ్చు, లేదా తెరవవచ్చు. కానీ ఈశాన్య భాగంలో వున్న షట్టర్‌ని ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయకూడదు.

'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న మాట దాదాపు అందరూ ఒప్పుకుంటారు. అయితే ఎంత కష్టపడినా పైకి రానివాళ్లు, సునాయాసంగా పైకి వచ్చేవాళ్లు కనిపిస్తుంటే ఈ మాటలను మరోసారి ఆలోచించాలనిపిస్తుంది.

మనిషి పైకి రావటానికి చేసే కృషితో ఇంటిని, దుకాణాన్ని వాస్తు పరంగా దిద్దుకోవటం కూడా ఒక భాగం కావాలి. అప్పుడే చేసిన కృషికి తప్పకుండా మంచి ఫలితాలు కనిపిస్తాయి.


తమిళ రచయితలలో నాకు ఓ మంచి మిత్రుడు ఉన్నాడు. ఆయన పేరు ఎస్.రామకృష్ణన్. ఆయన చెప్పిన విషయం.. ఒకానొకప్పుడు చెన్నై సముద్ర తీరాన ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకుని పరస్పరం పుస్తకాలు మార్చుకునే ఓ అపూర్వమైన కార్యక్రమం జరిగింది. ఒక్కొక్కరూ తాము చదివేసిన ఓ పుస్తకం లేదా రెండు పుస్తకాలను తీసుకొచ్చి సముద్ర తీరాన ఏర్పాటు చేసిన ఓ పెద్ద బల్ల మీద ఉంచమని ప్రకటించారు.

# పుస్తకపఠన ప్రాధాన్యం

వాటిలో ఏది నవలో, ఏది చిన్న కథల పుస్తకమో, ఏది వ్యాస సంకలనమో, ఏది చరిత్రకు సంబంధించిన పుస్తకమో, ఏది కవితల పుస్తకమో.. ఇలా అన్నింటినీ వేరు చేసి ఓ క్రమంలో పెట్టారు నిర్వాహకులు.

ఈ సందర్భంగా పుస్తక పఠనం గురించి ప్రముఖ రచయితలు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

అనంతరం ఎవరికి ఏది ఇష్టమో ఒకటో రెండు పుస్తకాలను బల్ల మీద నుంచి తీసుకుపోవచ్చు అని కూడా నిర్వాహకులు ప్రకటించారు.




ఈ కార్యక్రమంతో కొన్ని వందల పుస్తకాలు చేతులు మారాయి. ఇటువంటి పుస్తకం మార్పిడి కార్యక్రమం అంతటా నిర్వహిస్తే ఎంత బాగుంటుందో కదా. ఎందరి ఇళ్లల్లోనో పేరుకుపోయిన పుస్తకాలు ఇతరులకు చేరతాయి కదా. ఓ పుస్తకాన్ని చదవడం పూర్తి చేసిన తర్వాత ఇక ఆ పుస్తకం తమకు అక్కర్లేదనుకున్న పుస్తకాలను ఇంకొకరికి ఇచ్చే మనసుండటం అనేది ఎంతో ప్రియమైంది. ఎందుకంటే కొందరు పుస్తకాలను తమ ఇళ్లల్లో అలంకార ప్రాయంగా పెట్టుకుంటారే తప్ప వాటిని తాకరు, చదవరు. ఇటువంటివారు కొందరుంటే; ఇంకొందరు పెద్ద పెద్ద ఇళ్లు కట్టుకున్నా వారి దగ్గర ఒక్క పుస్తకమూ కనిపించదు. పుస్తకాలనేవి దండగ అనుకుంటారు. అక్కర్లేదనుకున్నవారి నుంచి పుస్తకాలు సేకరించి వాటి కోసం ప్రతి ప్రాంతంలోనూ ఓ బుక్ బ్యాంకుని ఏర్పాటు చేస్తే బాగుంటుందేమో. ఆ బుక్ బ్యాంకుకి ఎవరైనా ఏదైనా ఉస్తకం ఇవ్వవచ్చు. అక్కడి నుంచి ఎవరైనా తమకు కావలసిన పుస్తకం తీసుకుపో వచ్చునే విధంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. అయితే ఈ బుక్ బ్యాంకుకి కావలసింది నివాసం. వాటిని చూసుకోవడానికి ఓ మనిషి. ఇలా చేయడం వల్ల పుస్తకాలు చదివే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది.

నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అమ్మే దుకాణం, బ్యాంకు, క్యాంటీన్‌లా ప్రతి లేజీలోనూ ఓ పుస్తక దుకాణం ఉంటే..! కాలేజీ యాజమాన్యమే ఇందుకు నడుం బిగిస్తే ఎంత బాగుంటుందో కదా. పాఠ్యపుస్తకాలకవతల సాహిత్యం, చరిత్ర, శాస్త్రం.. ఇలా ఎన్నో అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి. ఇవన్నీ తెలుసుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత. చదవని సమాజం బాగుపడాలంటే పుస్తక పఠనం తప్పనిసరి.

ఆస్ట్రేలియాలోని విశ్వవిద్యాలయాలలో చదువుకునే విద్యార్థులు తమకు సమయం ఉన్నప్పుడు ఆస్పత్రులకు వెళ్లి అక్కడి రోగులకు పుస్తకాలు చదివి వినిపిస్తారని ఓ చోట చదివాను. అలాగే కంటిచూపు లేని కేంద్రాలకు వెళ్లి పుస్తకాలు చదివి వినిపిస్తారట. చిన్న పిల్లలకు కథలు చెప్తారట. అందులోనూ నీతి కథలను ఎంతో ఇష్టంగా చెప్తారు. మన దేశంలోనూ విద్యాలయాలలో ఇటువంటి ఏర్పాట్లు వుంటే బాగుంటుంది. అమెరికాలో ముఖ్యమైన లైబ్రరీలలోని పాతబడిన పుస్తకాలను వారానికి ఒకసారి ఓ డాలరు, రెండు, డాలర్లకు అంటూ చవకగా అమ్మేస్తుంటారు. ఎవరైనా ఆ పుస్తకాలను కొనుక్కో వచ్చు. మన దేశంలో ఎక్కడైనా ఇలాంటి ఏర్పాట్లు ఉన్నాయో లేవో నా దృష్టికైతే రాలేదు.

తమిళనాడులో మదురైతిట్టం అనే ఓ ఇంటర్నెట్ పుస్తకాలను షేర్ చేయడంలో తోడ్పడుతోంది. గూటెన్‌బర్గ్ అనే ఓ ఇంగ్లీష్ ఇంటర్నెట్‌లో లక్షకు పైగా మంచి మంచి పుస్తకాలను ఉచితంగా అందుబాటులో ఉంచింది. అయితే నా మిత్రుడు రామకృష్ణన్ సముద్ర తీరాన ఏర్పాటు చేసిన పుస్తక మార్పిడి కార్యక్రమం ద్వారా ఓ పుస్తకం సంపాదించారు. అది ఇంగ్లీషు పుస్తకం. మెమొరీస్ ఆఫ్ మద్రాస్. రచయిత సర్ చార్లెస్ లాసన్. ఈ పుస్తకం 1905లో లండన్‌లో ముద్రించారు. ఈ చార్లెస్ లాసన్ ఎవరో కాదు.. మద్రాస్ మెయిల్ అనే పత్రికకు సంపాదకుడు.



1830లలో చెన్నైలో రెండు పత్రికలే ఉండేవి. అవి: ది స్పెక్ టేటర్, ది మెడ్రాస్ టైమ్స్. ఈ రెండు పత్రికలను ఇంగ్లీష్‌వారే నడిపారు. మెడ్రాస్ టైమ్స్ పత్రికలో పని చేసిన లాసన్ అక్కడి నుంచి తప్పుకుని 1868లో మెడ్రాస్ మెయిల్ ప్రారంభించారు. వ్యాపారస్తులతో మంచి సంబంధాలు కలిగి ఉండిన ఆయన మెడ్రాస్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శిగా ముప్ఫై ఏళ్ల పని చేసారు. 1887లో ఆయన ఇంగ్లండుకి వెళ్లి విక్టోరియా రాణిని కలిసారు. అప్పుడు విక్టోరియా రాణి ఆయన ప్రతిభను ప్రశం సించి లాసన్‌ను 'సర్' బిరు దుతో గౌరవించింది. ఈయన మద్రాసు నగర చరిత్రను మెడ్రాస్ మెయిల్‌లో సీరియల్‌గా రాశారు. ఆ సీరియలే తర్వాత కాలంలో ఓ పుస్తకంగా వెలువ డింది. ఈ పుస్తకంలో మద్రాసును పాలించిన పాలకులు, వారి తీరుతెన్ను లను వివరించారు. వాటిలో ముఖ్యమైనవి రెండు విషయాలు.. సర్ ఫ్రాన్సిస్ డే, ఆండ్రూ అనే ఇద్దరు 1639లో చెన్నై పట్టణాన్ని కొను గోలు చేసి కొత్త నగరాన్ని ఏర్పాటు చేయడానికి పూనుకు న్నారు. అలాగే మరెన్నో



విషయాలు ఇందులో పొందుపరిచారు లాసన్.

1787లో చెన్నైకి వచ్చిన డాక్టర్ ఆండ్రూ బెల్ చెన్నైలోని ఎగ్మూరులో ఓ అనాథ సంస్థలో పని చేస్తున్నప్పుడు తాను నేర్చు కున్న విద్యను ఇంగ్లండుకి వెళ్లిన తర్వాత అక్కడ మెడ్రాస్ సిస్టిమ్ అనే విధానాన్ని పరిచయం చేశారు. ఈ వివరాలు కూడా లాసన్ రాసిన పుస్తకంలో ఉన్నాయి. మెడ్రాస్ సిస్టమ్ అంటే మాతృభాషలో చదువుకోవాలన్న విధానం. ఆండ్రూ బెల్ ప్రవేశపెట్టిన ఈ విధానానికి మంచి ఆదరణ లభించింది. అంతేకాదు, మద్రాసు మీది ప్రేమతో ఆయన ఇంగ్లండులో కొన్న తన ఓ వ్యవసాయ క్షేత్రానికి ఎగ్మోర్ అని పేరు పెట్టుకున్నారు. ఆయన పదమూడు పాఠశాలలు నడిపారు. అవన్నీ విజయవంతం కావడంతో ఇంగ్లండులో 230 పాఠశాలలు మెడ్రాసు సిస్టమ్‌ను వాడకలోకి తెచ్చాయి. ఇటువంటి వివరాలన్నీ తెలియాలంటే పుస్తక పఠనం ఎంతో అవసరం. ఓ పుస్తకం బతకాలంటే చదువరి ఎంతో ముఖ్యం. లేకుంటే ఎన్ని పుస్తకాలు మన చుట్టూ వుండి వుండి ఏం లాభం?

**- యామిజాల జగదీశ్**

---

## ప్రకృతి దృశ్య కావ్యం..

**(7వ పేజీ తరువాయి)**

టూరిజం కూడా పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది. మలేషియాలోని మెర్డెకా స్క్వేర్, బటూ కేవ్స్, తీన్ హౌ టెంపుల్, బుడయ మొదలైన పర్యాటక విశేషాలు తిలకించడానికి ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు వస్తుంటారు. కొంతమంది మలేషియా వాసులు చిన్న నదులపై బోట్లపై తిరుగుతూ కూరగా యలు, పండ్లు అమ్మడం ఆకర్షణగా కనిపిస్తుంది. కోటభరూ



మార్కెట్ మలేషి యాలోని పెర్దినియన్ దీవిలో ఉంది. మలేషియా సెంట్రల్ మార్కెట్ థాయ్‌లాండ్ బార్డర్‌కు సమీపంలో ఉంది. దీన్ని తిలకించడానికి అనేకమంది పర్యాట కులు వస్తుంటారు. ఇక్కడ తాజా పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు ఎక్కువగా లభిస్తాయి. వీటి ధరలు సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటాయి.

### భిన్న సంస్కృతులకు నిలయం

మలేషియాకు స్వాతంత్ర్యం 1957లో వచ్చింది. పదమూడు రాష్ట్రాలుగా, మూడు ఫెడరల్ టెరిటరీస్‌గా ఉన్న ఈ దేశ జనాభా మూడు కోట్లకు మించదు. స్థానిక మలై ప్రజలతో పాటు చైనా, భారతదేశ ప్రజానీకం శతాబ్దాలుగా కలసి మెలసి జీవిస్తున్నారు. ఈ దేశ జనాభాలో భారతీయుల జనాభా ఏడు శాతం. అందులో తమిళులదే సింహ భాగం. దాదాపు అన్ని రంగాల్లో మహిళలు పురు షులతో సమానంగా పని చేస్తూ కనిపి స్తారు. మలేషియా ఇస్లాం దేశమైనప్పటికీ భిన్న సంస్కృతుల సమ్మేళనంగా భాసిల్లు తోంది. ముస్లిం దేశమైనప్పటికీ ఆ ఛాయలెక్కడా కనిపించవు. హిందూ, బుద్ధిజం, క్రిస్టియన్ .. ఇలా అన్ని రకాల మతాలను ఆచరించేవాళ్లు ఇక్కడ కనిపిస్తారు.

శతాబ్దాల చరిత్ర కలిగిన బౌద్ధ నిర్మా ణాలు, బుద్ధుని అతి పెద్ద విగ్రహాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన అద్భుతమైన మసీదులు ఇక్కడ నిర్మించారు. వీటిలో క్రిస్టల్ మాస్క్ అందాలు కనులు మిరుమిట్లు గొలిపే విధంగా ఉండటమే గాక వర్ణనాతీతంగా నిర్మించారు. రబ్బరు ఉత్పత్తి చేయడంలో ప్రపంచంలో మూడో అతి పెద్ద దేశమిది.

ప్రపంచంలోనే రబ్బరు చేతి తొడుగులు తయారు చేయడంలో మలేషియా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. మలేషియా అధికార భాష మలైలో. అంటే కొత్త 'కొత్త గ్రామం' అని అర్థం. అలా అని సరికొత్త ఊరు అనుకుంటే పొరపాటు పడ్డట్టే. కేవలం 110 సంవత్సరాల చరిత్ర కలిగి వేయి కుటుంబాలతో పయనం ప్రారంభించిన మలేషియా ఇప్పుడు పర్యాటక రంగంలో ప్రపంచంలో తొమ్మిదవ స్థానంలో ఉండి అందరినీ ఆకర్షిస్తోంది. ప్రస్తుతం మలేషియా అత్యాధునిక భవంతులు, ఆకాశహ ర్మ్యాలు, నవీన రహదారులు, ఫ్లైఓవర్లు, శరవేగంతో దూసుకుని వెళ్లే రైళ్లు... మొదలైన అత్యాధునిక హంగులతో అభివృద్ధి పథంలో దూసుకుని పోతోంది. ఏడాదికి లక్షల సంఖ్యలోనే ప్రపంచ పర్యాటకులు మలేషియా రావడంతో ఇక్కడి ప్రజలకు పర్యాటక రంగమే ప్రధాన జీవనాధారంగా మారింది.



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంగా ఎదుర్కొంటారు. వృధా ఖర్చులను నియంత్రించడం మంచిది. విద్యార్థులకు విదేశీ యాన సూచనలున్నాయి. కుటుంబంలో చిన్న చిన్న మనస్పర్థలకు అవకాశం. ఆరోగ్య, ఆహార సలహాలు-సూచనలు తూచా తప్పకుండా పాటించండి. చిరు వ్యాపారులకు లాభం.

## వృషభం



అనుకోని ఖర్చులు వచ్చి పడతాయి. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. చర్చలు ఫలిస్తాయి.

## మిథునం



దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలున్నాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆలోచనలు ఫలిస్తాయి. పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. పారిశ్రామికవేత్తలకు ఆశాజనకంగా ఉంటుంది. స్త్రీలు స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు.

## కర్కాటం



ఆరోగ్య సమస్యలుంటాయి. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తీర్థ యాత్రలు చేస్తారు. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. కళాకారులకు సన్మాన యోగం, కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. శత్రువులు మిత్రులవుతారు. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి.

## సింహం



స్త్రీలకు అనుకోని విధంగా ఆస్తి కలిసొస్తుంది. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. సాహిత్య సభలు వాయిదా వేస్తారు. శత్రువులు మిత్రులవుతారు. వాక్చాతుర్యంతో ముఖ్యమైన పనులు చక్కబెట్టుకుంటారు. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. చోర భయం పొంచి వుంది కనుక విలువైన వస్తువులు, పత్రాల పట్ల అప్రమత్తంగా ఉండండి.

## కన్య



ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. విద్యార్థులకు శుభ యోగం.గతంలో ఆగిపోయిన పనులు వారాంతంలో పూర్తి చేస్తారు. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. తీర్థ యాత్రలు చేస్తారు. వృత్తి విద్యాకోర్సులు అభ్యసించిన వారికి ఉన్నతోద్యోగం లభిస్తుంది. కాలానుగుణంగా వ్యాపారాలు చేసే వారికి ఆశించిన ఫలితాలు ఉంటాయి. అందరూ మీ మాటే వేదవాక్కులా ఆచరిస్తారు.

## తుల



నూతన వాహన యోగం. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. సామాన్య ధన లాభ సూచనలున్నాయి. కళాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. చిన్ననాటి మిత్రులకు సహాయ సహకారాలు అందిస్తారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది, ఫలితాలు కూడా అలాగే ఉంటాయి. శత్రువులు మిత్రులవుతారు. సొంతింటి కల నెరవేరే సూచనలున్నాయి.

## వృశ్చికం



దంపతుల మధ్య అన్యోన్యత ఏర్పడుతుంది. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు చేసేవారికి పోటీ ఏర్పడుతుంది. వృద్ధాశ్రమాలకు ఇతోధికంగా సహాయం చేస్తారు. తీర్థ యాత్రలు చేస్తారు. ఉద్యోగులు ఎదురు చూస్తున్న శుభ వర్తమానం తెలుస్తుంది.

## ధనుస్సు



స్త్రీలకు శుభ యోగం. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. శుభ కార్యాలకు హాజరవుతారు. శ్రమకు తగిన ప్రతిఫలం లభించక పోవచ్చు అంతామాత్రాన నిరాశ చెందకండి. వ్యవసాయ భూమి కొనుగోలు చేసే సూచనలు అధికం. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

## మకరం



అనూహ్యంగా మొండి బాకీలు వసూలవుతాయి. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ప్రారంభించిన పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. చిరకాల స్వప్నం నెరవేరుతుంది. ప్రభుత్వ సంబంధమైన పనులు వాయిదా పడతాయి. క్రీడాకారులకు సన్మాన యోగం.

## కుంభం



ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎదురు చూస్తున్న శుభ సమాచారం వారాంతంలో తెలుసుకుంటారు. స్త్రీలకు శుభ యోగం.జీవిత భాగస్వామి ద్వారా స్థిరాస్తి కలిసొస్తుంది. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేసి అందరి మన్ననలు పొందుతారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. డ్రైవింగ్‌లో మెళకువలు నేర్చుకుంటారు.

## మీనం



ఉద్యోగులకు పనివత్తిడి అధికం. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. శత్రువులు మిత్రులవుతారు. ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి, సమన్వయంతో వ్యవహరించండి. గతంలో వాయిదా పడిన పనులు తిరిగి ప్రారంభిస్తారు. ప్రభుత్వ సంబంధమైన పనులు పూర్తి చేస్తారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు.

# ఆమే గొప్ప..!




అతడి కంటే ఆమే గొప్ప
అతడితో పాటే ఉదయం ఉద్యోగానికి వెళుతుంది
కానీ అతడి కంటే ముందే
లేచి / వంట చేసి పిల్లలను
స్కూల్‌కి పంపుతుంది
అందుకే అతడి కంటే
ఆమే గొప్ప!
సాయంత్రం అతడితో
పాటు ఉద్యోగం ముగించుకొని ఇంటకొస్తుంది
ఇంటికి వచ్చాక తిరిగి ఇంటిపని చేసి
అందరూ పడుకున్న తరువాతే తను పడుకుంటుంది
అందుకే అతడి కంటే ఆమే గొప్ప!
ఆమె భవన నిర్మాణ పనులకు అతడితో కలిసి వెళుతుంది
అక్కడ ఇద్దరు మగవారికి కావల్సినవి
తాను ఒక్కత్తే అందిస్తుంది
అందుకే అతడి కంటే ఆమే గొప్ప!
అతడు ఐఏఎస్, ఐపీఎస్, బంట్రోతు కాగలిగాడు
ఆమె కూడా ఐఏఎస్, ఐపీఎస్, బంట్రోతు అయింది
అందుకే అతడి కంటే ఆమే గొప్ప!
అతడు తన పిల్లలు, తల్లిదండ్రులను
ఆవేశంతో ఆదేశిస్తాడు
కానీ ఆమె బుజ్జగించి, లాలించి, పాలిస్తుంది
అందుకే అతడి కంటే ఆమే గొప్ప!
అతడికి ఆవేశం ఎక్కువ.. ఆమెకి ఓపిక ఎక్కువ
అతడు పిల్లలను కనలేడు.. ఆమె పిల్లలను కని పెంచుతుంది
అందుకే అతడి కంటే ఆమే గొప్ప!
అతడు వేధిస్తున్నాడు.. అవమానిస్తున్నాడు..
అఘాయిత్యాలు చేస్తున్నాడు
ఆమె అవమానాలు.. ఛీత్కారాలు.. వేధింపులు భరిస్తుంది
అందుకే అతడి కంటే ఆమే గొప్ప!
అన్ని విషయాల్లోనూ అతడి కంటే ఆమే గొప్ప
అయినా సమాజం మాత్రం అతడే గొప్ప అంటుంది
అదే సంప్రదాయమంటుంది.. అదే పాటించాలంటుంది.

**- పల్లాపు నాగమణీంద్ర**

---

# పునరుద్ధరణ



ఈ వారం కవిత్వం

గాలి ఊపుమీదుంది
మొగ్గలు పిందెలు రాలి
గాలి ఊపు అలానే కొనసాగుతుంది
చిన్న కొమ్మలు దాని రెమ్మలు విరిగిపడి
గాలిని ఆపే శక్తి ఎవరిది?
దాని ఇష్టారాజ్యం కొనసాగుతుంది
చెట్టునే కూల్చేసింది
అదే గాలి క్షణంలో
తెరమరుగైంది
పుట్టుకొచ్చిన నిరాశ నిస్పృహతో
ఏమి లాభం?
అక్కడే పునరుద్ధరణ జరగాలంటే
ఇక మరో విత్తనం నాటడమే!

**- కోటం చంద్రశేఖర్**



# భారతీయ సినిమా పితామహుడు.. సత్యజిత్‌రే



**చిత్రభారతి**

వాశిరాజు ప్రకాశం


**వంద సంవత్సరాల చారిత్రాత్మక సినిమాలో భారతదేశానికి విదేశాల్లో అత్యున్నత పీఠం వేసిన ఒక్కరి పేరు ఎవరిదని అడిగితే- వెంటనే మరో ఆలోచన లేకుండా గుర్తుకు వచ్చే పేరు సత్యజిత్‌రే.**

ఆయన బహుముఖ ప్రజ్ఞావంతుడు. సినిమా వైభవం కోసమే ఆయన జన్మించారని చెపితే అందులో అతిశయోక్తి లేదు. 1960-70 కాలంలో ఆయన వెలిగించిన బెంగాలీ సినిమా వెలుగులు నేటికీ దేశం నలు దిశలా వెలుగుతున్నాయంటే కారణం.. ఆయన తన సినిమాల ద్వారా అందించిన అమోఘమైన సందేశం.

సినిమా అంటే కేవలం బొమ్మల ప్రదర్శన కాదు, ఒక సినిమా చూసిన ప్రేక్షకుడికి కొంతయినా కనువిప్పు కలగాలని, అదే భావాన్ని భావితరాలకు కూడా అందించాలన్న ఆయన స్వప్నం నిజం అయినట్లు సినిమా చరిత్ర చెపుతుంది.

తొలి దశలో ఆయన సినిమా తీయాలని 1965లోనే తానే కథ రాసుకున్నారు. ఆ తొలి చిత్రం పేరు 'పథేర్ పాంచాలి'. దీని ఆంగ్ల నామం 'సాంగ్ ఆఫ్ ది రోడ్'. రహదారి వెంట కమ్మగా వినిపించే సంగీత రాగం. కథ అయితే రెడీ అయినా చేతిలో డబ్బు లేక, నిరాశతో వున్న రోజుల్లో ఆయన్ను ఆదుకున్నది అప్పటి బెంగాలీ ముఖ్య మంత్రి బి.సి.రాయ్. ఆయన కూడా గొప్ప సినిమా అభిమాని కావటం భారతీయ సినిమా అదృష్టం. సత్యజిత్‌రే ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తూ వున్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి బి.సి.రాయ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున భాగస్వామ్య పద్ధతిలో లక్షా ఏభై వేలు అందించారు. అదే భారతీయ సినిమాకు సూర్యోదయం.. నవోదయం.

'పథేర్ పాంచాలి' విదేశాలకు సైతం వెళ్ళి, భారతీయ సినిమాకు వివిధ దేశాల్లో పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది. సత్యజిత్‌రే ఇరవై ఐదు చిత్రాలకు దర్శకత్వం వహించారు. అపజయం తెలియకుండా ఆయన అందించిన చిత్రాల్లో ఈనాటి 'చిత్రభారతి'లో 'నాయక్' అనే సినిమాను సత్యజిత్‌కు నివాళిగా గుర్తు చేసుకుందాం. 'నాయక్' అంటే బెంగాలీలో హీరోగా అన్వయించుకోవాలి. పేరుకు తగినట్లు ఒక సినిమా హీరో





ఆత్మీయ కథ ఇది. అప్పటి బెంగాలీ వెండితెర వెలుగు ఉత్తమ్‌కుమార్ ఈ 'నాయక్' పాత్రలో నటించి, బెంగాలీ ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. కథా కథనం ప్రకారం ఒకే ఒక రాత్రి కథ ఆరంభమవుతుంది, ముగుస్తుంది కూడా. ఇందులో ఉత్తమ్‌కుమార్‌కు తోడుగా జర్నలిస్టు పాత్రలో షర్మిలా టాగోర్ నటించారు. మూడో పాత్ర లేదు, రాదు. ఉత్తమ్‌కుమార్‌కు ఢిల్లీలో అభిమానులు మరునాడు భారీ ఎత్తున సన్మానం చేయటం కథలో కీలక ఘట్టం. ఆ సన్మానానికి వెళ్లేందుకు ముందురోజు సాయంత్రం..


ఆరు గంటలకు కలకత్తా(కోల్‌కతా) రైల్వే స్టేషన్‌లో ఆయన ఫస్ట్ క్లాస్‌లో ఆసీనులవుతారు. అదే బోగీలో షర్మిలా టాగోర్ ఢిల్లీ సభకు విలేకరి హోదాలో ప్రయాణమవుతారు. కంపార్టుమెంటులో కూర్చొని కబుర్లలో పడినా అప్పటికే బాగా గౌరవప్రదమైన ఉత్తమ్‌కుమార్ హీరో, జర్నలిస్టు షర్మిలా టాగోర్ ఆసక్తికరమైన అలనాటి కబుర్లలోకి వెళతారు. హీరో కాలక్షేపం కోసం మద్యం తీసు కుంటూ ఆనాటి జ్ఞాపకాలను ఒక్కొ క్కటిగా షర్మిలాకు చెపుతారు. ఆమె మద్యం జోలికి వెళ్లని గౌరవప్రదమైన భారతీయ మహిళగా మంచి సంప్రదాయం తెలిసిన జర్నలిస్టుగా హీరో చెప్పే కబుర్లు వింటుంటుంది. మద్యం ప్రభావం వల్ల హీరో అలనాటి విషయాలెన్నో చెప్తుంటారు. ఇద్దరి మధ్య దూరతీరాలు వుండటం గమనార్హం. హీరో చెప్తున్న అంశాలన్నీ షర్మిలా తన నోట్‌బుక్‌లో పదిలంగా రాసుకుంటుంది. అవన్నీ రాసుకున్న వేళ, వాటిని మరునాడు తన పత్రికలో వేయాలన్న ఆశ వుండేది. కారణం.. హీరో చెప్పిన వ్యక్తిగత విషయాలు ఎంతో ఆసక్తికరమైన విషయాలు. రాత్రి పన్నెండు గంటలయ్యాక హీరో నిద్రలో వాలిపోయారు. షర్మిలా దూరంగా వున్న తన బోగీలోకి వెళ్లిపోతుంది. ఎవరి ప్రపంచం వారిదే. ఎవరి సంస్కారం వారిదే. అక్కడ ఆనాటి అంశాలు, కథలు, మరికొన్ని బాధలు.. అవే అంశాలు.

తెల్లవారింది.. రైలు ఢిల్లీ రైల్వే స్టేషన్ చేరింది. అప్పటికే అభిమానులు ఢిల్లీ స్టేషన్‌కు గుంపులుగా గుంపులుగా చేరారు. షర్మిలా వీరందరినీ గమనిస్తూ మరోవైపు తాను క్రితం రాత్రి నోట్ చేసుకున్న అలనాటి కథలను గురించి మళ్లీ మళ్లీ ఆలోచించి- యివన్నీ పత్రికల్లో వేస్తే తన వృత్తి ధర్మానికి తీరని శాపమవుతుందని గ్రహిస్తుంది. రాత్రి రాసుకున్న నోట్స్‌ను తన హ్యాండ్ బ్యాగ్‌లోంచి తీసి ముక్కలు ముక్కలుగా చేసి, గాల్లో ఎగురవేస్తుంది. కాగితం ముక్కలు గాల్లో ఎగురుతుంటే షర్మిలకు తాను ఆచరించిన ధర్మానికి, నిర్ణయానికి పకపక నవ్వుటంతో సినిమా శుభం పలుకుతుంది. ◆

# ఈ వారం కా'ర్టూన్స్'


... అంతరాత్మ చెప్పినట్లే ఓటేస్తాను...!!


.. అందరికంటే ఎక్కువే ఇచ్చాం... కానీ ఫోన్ ఛార్జీలు ఇవ్వ లేదని అలిగి వెళ్తున్నాడు...!!
ఎన్నికలు


ఏమేవ్..!
బాత్రూం
ఆఁ...పవర్ బ్యాంక్ తెస్తున్నానండీ..!!

అంతా

మచ్చలు మచ్చలుగా వున్నాయేంటి ఈ ఫొటోలు? అని ఆశ్చర్యపోతున్నారా? ఈ వింత సరస్సు కెనడాలో వుంది. దీని పేరు 'స్పాటెడ్ లేక్' అంటే మచ్చల సరస్సు అని అర్థం. నీటి పైన మచ్చలు మచ్చలుగా కనిపిస్తున్నందు వల్ల దీనికి ఆ పేరు వచ్చిందట. ఈ సరస్సులో కాల్షియం, మెగ్నీషియం సల్ఫేట్ మొదలైన ఖనిజాలు ఉన్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. విచిత్రమైన ఈ సరస్సును చూడడానికి పర్యాటకులు క్యూ కట్టడంలో ఇక

వింతేముంది?









